


# పోరు తెలంగాణ
డిజిటల్ తెలుగు దినపత్రిక




కరీంనగర్ సంపుటి : 11 సంచిక : 322 ఆదివారం 20-09-2026 ఎడిటర్ : కొండ ప్రవీణ్ కుమార్ పేజీలు : 04 వెల : 04

## పాకిస్థాన్‌ను చుట్టుముట్టిన ఆర్థిక సంక్షోభం

కోరలు చాస్తున్న పేదరికం




- పాకిస్థాన్‌లో ప్రమాదకర స్థాయికి చేరిన పేదరికం
- గడిచిన ఆరేళ్లలో 21.8శాతం నుంచి 28.9శాతానికి పెరిగిన వైనం
- పట్టణాలతో పోలిస్తే గ్రామాల్లోనే ఎక్కువ ప్రభావం
- అధిక ద్రవ్యోల్బణం, ఆర్థిక సంక్షోభాలే ప్రధాన కారణాలు
- వృద్ధి ఫలాలు సంపన్నులకే.. పేదలకు తప్పని కష్టాలు

దాయాది దేశం పాకిస్థాన్‌ను పేదరికం చుట్టుముడుతోంది. గడిచిన ఆరేళ్లలో దేశ ఆర్థిక వ్యవస్థ తీవ్ర ఒడిదొడుకులకు లోనుకావడంతో - మిగతా 2 లో

## పశ్చిమాసియా యుద్ధంలో మునిగిన ప్రపంచం

హర్మూజ్, సూయజ్ వ్యాపారానికి పెను ముప్పు!



- హర్మూజ్ ద్వారా చమురు రవాణా రెండొంతులకు పునరుద్ధరణ
- రవాణా పూర్తిగా నిలిచిపోయిందనే వాదనలను కొట్టిపారేసిన అమెరికా
- జోర్డాన్‌లోని అమెరికా బేస్‌పై ఇరాన్ దాడి, ఇద్దరు యూఎస్ సైనికుల మృతి
- సూయజ్ కాలువను మూసివేయడానికి ఇరాన్ ప్రయత్నం?
- యుద్ధం కారణంగా విపరీతంగా పెరిగిన పెట్రోల్, డీజిల్ ధరలు

పశ్చిమాసియాలో ముదురుతున్న యుద్ధం ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు గుండెకాయ లాంటి చమురు రవాణా మార్గాలను ప్రమాదంలోకి - మిగతా 2 లో

## తెలంగాణకు కొత్త మెట్రో

ప్రాజెక్టులకు అనుమతులపై కేంద్రమంత్రి కీలక వ్యాఖ్యలు



- తెలంగాణలో కొత్త మెట్రో రైలు ప్రాజెక్టులకు అనుమతి ఇవ్వలేదని కేంద్రం స్పష్టం
- రాజ్యసభలో ఎంపీ ప్రశ్నకు కేంద్ర మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ రాతపూర్వక సమాధానం
- హైదరాబాద్ మెట్రో ఫేజ్-1కు రూ.1,204 కోట్లు ఇచ్చామని వెల్లడి
- ఏపీలో ఎలాంటి మెట్రో ప్రాజెక్టులు అమలులో లేవని స్పష్టీకరణ

తెలంగాణలో కొత్తగా ఎటువంటి మెట్రో రైలు ప్రాజెక్టులకు అనుమతులు మంజూరు చేయలేదని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. - మిగతా 2 లో

## తిరుమలకు భారీగా భక్తుల రాక

31 కంపార్ట్‌మెంట్లు ఫుల్



- తిరుమలలో కొనసాగుతున్న భక్తుల రద్దీ
- వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని 31 కంపార్ట్‌మెంట్లు పూర్తి
- శ్రీవారి సర్వదర్శనానికి సుమారు 18 గంటల సమయం
- ఆదివారం రూ. 4.05 కోట్లుగా నమోదైన హుండీ ఆదాయం
- నిన్న శ్రీవారిని దర్శించుకున్న 90,956 మంది భక్తులు

తిరుమల శ్రీవారి దర్శనానికి భక్తులు పోటెత్తుతున్నారు. గత కొన్ని - మిగతా 2 లో

# 22ఏ భూములపై సర్కార్ కీలక నిర్ణయం

- సమస్యలకు చెక్ పెట్టేలా హైలెవల్ కమిటీ!
- ఛైర్మన్‌గా సీసీఎల్ఏ కమిషనర్ లోకేశ్ కుమార్
- ఇద్దరు ఉన్నతాధికారులు సభ్యులుగా నియామకం
- భూ యజమానుల విజ్ఞప్తుల పరిశీలన
- క్షేత్రస్థాయి సమస్యలపై కమిటీ దృష్టి
- పరిష్కారానికి కార్యాచరణ రూపొందించనున్న కమిటీ



2లో

## స్కైరూట్ విజయం వేళ రాహుల్ వయసుపై

# ప్రధాని మోదీ చురకలు

- ప్రైవేట్ రాకెట్ ప్రయోగించిన యువతను ప్రశంసించిన ప్రధాని మోదీ
- రాహుల్ గాంధీ వయసును ఉద్దేశించి పరోక్షంగా సెటైర్లు
- స్కైరూట్ బృందం సగటు వయసు 28 అని వెల్లడి
- తాను మాట్లాడుతోంది 56 ఏళ్ల యువకుడి గురించి కాదన్న ప్రధాని



2లో

పార్లమెంట్ వర్షాకాల సమావేశాల ప్రారంభానికి ముందు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీపై పరోక్షంగా విమర్శలు గుప్పించారు. భారత్‌లో తొలి ప్రైవేట్ ఆర్బిటల్ రాకెట్‌ను విజయవంతంగా

## ఉక్రెయిన్‌లో కార్గో నౌకపై దాడి

నలుగురు భారతీయులతో సహా పలువురు మృతి



- ఉక్రెయిన్‌లోని ఒడెస్సా సమీపంలో పౌర నౌకపై క్షిపణి దాడి
- ధాన్యం లోడుతో వెళుతున్న పౌర కార్గో నౌక లక్ష్యంగా దాడి
- దాడిలో మరో భారతీయుడికి తీవ్ర గాయాలు

ఉక్రెయిన్‌లోని ఒడెస్సా నౌకాశ్రయం సమీపంలో పెను విషాదం చోటుచేసుకుంది. - మిగతా 2 లో

## విద్యార్థులపై లాఠీచార్జ్ స్పందించిన రాహుల్ గాంధీ



- పరీక్షల్లో అక్రమాలపై ఢిల్లీలో విద్యార్థుల భారీ నిరసన
- పార్లమెంట్ వైపు వెళుతున్న ఆందోళనకారులపై పోలీసుల లాఠీచార్జ్
- విద్యార్థులపై దాడి అప్రజాస్వామికమని రాహుల్ గాంధీ తీవ్ర విమర్శ
- కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని నిరసనకారుల డిమాండ్

పరీక్షల్లో జరుగుతున్న అక్రమాలకు వ్యతిరేకంగా పార్లమెంట్ ముట్టడికి యత్నించిన - మిగతా 2 లో

## దశాబ్దాల మొండి సమస్యకు మంత్రి నారా లోకేశ్ శాశ్వత పరిష్కారం



- మంగళగిరిలో దశాబ్దాల ఇంటి స్థలాల సమస్యకు మంత్రి లోకేశ్ పరిష్కారం
- 'మన ఇల్లు -- మన లోకేశ్' కింద రెండో విడతలో 3 వేల మందికి పట్టాల పంపిణీ
- ఈ నెల 21, 22 తేదీల్లో లబ్ధిదారులకు పట్టాలు అందించనున్న మంత్రి
- నిషేధిత జాబితాలోని భూములకు ఎంజాయ్‌మెంట్ సర్టిఫికెట్లు జారీ
- సుమారు రూ.1,000 కోట్ల విలువైన భూములకు పేదలకు శాశ్వత హక్కులు

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ, మంగళగిరి నియోజకవర్గంలో దశాబ్దాలుగా నెలకొన్న జఠిలమైన భూ సమస్యకు రాష్ట్ర ఐటీ, - మిగతా 2 లో

## ఏపీలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు

# ప్రైవేటీకరణ చేస్తున్నారా?

సీఎం చంద్రబాబు సమాధానం ఇదే!

- సబ్-రిజిస్ట్రార్ ఆఫీసుల ప్రైవేటీకరణ వార్తలు అవాస్తవమన్న చంద్రబాబు
- పాస్‌పోర్ట్ సేవా కేంద్రాల మాదిరిగా రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాలు అని వివరణ
- దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని అధికారులకు సీఎం ఆదేశం
- ఉద్దేశపూర్వకంగా పిటిషన్లు వేసేవారిని గుర్తించాలని సూచన
- రాష్ట్రంలో 49% వర్షపాత లోటు.. ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి పెట్టాలి

2లో




రాష్ట్రంలో సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాలను ప్రైవేటీకరిస్తున్నారంటూ జరుగుతున్న ప్రచారంలో ఏమాత్రం వాస్తవం లేదని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ప్రజలకు మరింత మెరుగైన,

## పదో తరగతి ఫెయిల్ గ్రేస్ మార్కులతో పాసయ్యా



- చదువుతో పేదరికాన్ని జయించవచ్చన్న మంత్రి నారాయణ
- పదో తరగతి ఫెయిల్ అయినా పట్టుదలతో పైకొచ్చానని వెల్లడి
- నెల్లూరులో ప్రతిభావంతులైన విద్యార్థులకు అవార్డుల ప్రదానం
- అవకాశాలను అందిపుచ్చుకోవాలని విద్యార్థులకు పిలుపు

చదువుతో పేదరికాన్ని జయించవచ్చని, కష్టపడితే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని ఏపీ - మిగతా 2 లో

## దశాబ్దాల మొండి సమస్యకు మంత్రి నారా లోకేశ్ శాశ్వత పరిష్కారం

మొదటిపేజీ తరువాయి - విద్య శాఖ మంత్రి నారా లోకేశ్ శాశ్వత పరిష్కారం చూపారు. ప్రభుత్వ భూముల్లో నివసిస్తున్న పేదలకు యాజమాన్య హక్కులు కల్పించే ప్రక్రియను వేగవంతం చేశారు. ఇందులో భాగంగా, 'మన ఇల్లు -- మన లోకేశ్' కార్యక్రమం కింద రెండో విడతలో సుమారు 3,000 కుటుంబాలకు ఈ నెల 21, 22 తేదీల్లో శాశ్వత పట్టాలు పంపిణీ చేసేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మంగళగిరి నియోజకవర్గంలోని కొండవాలు, అటవీ, దేవాలయ భూముల్లో వేలాది కుటుంబాలు దశాబ్దాలుగా ఇళ్లు నిర్మించుకుని నివసిస్తున్నాయి. అయితే, ఆ స్థలాలపై వారికి ఎలాంటి చట్టబద్ధమైన హక్కులు లేకపోవడంతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తమ ఆస్తులను పిల్లలకు బదిలీ చేయాలన్నా, అత్యవసరానికి రుణం పొందాలన్నా వీలుకాని దుస్థితి నెలకొంది. ఎన్నికల ప్రచారంలో ఈ సమస్యను గుర్తించిన లోకేశ్, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఆ మాట ప్రకారం, అధికారంలోకి వచ్చిన వెంటనే చర్యలు చేపట్టారు. ఈ ఏడాది ఏప్రిల్‌లోనే తొలి విడతలో భాగంగా రత్నాల చెరువు, యర్రబాలెం, నీరుకొండ వంటి ప్రాంతాల్లో 3,002 మందికి సుమారు రూ.1,000 కోట్ల విలువైన భూములపై శాశ్వత హక్కులు కల్పించారు. ప్రస్తుతం రెండో విడతలో భాగంగా మంగళగిరి డీజీపీ కార్యాలయం సమీపంలోని సీకే కన్వెన్షన్ హాలులో పట్టాల పంపిణీ కార్యక్రమం జరగనుంది. ఈ విడతలో అందించే పట్టాల మార్కెట్ విలువ కూడా సుమారు రూ.1,000 కోట్లు ఉంటుందని అంచనా.

**వివిధ కేటగిరీల కింద పట్టాల పంపిణీ:**

సెక్షన్ 22ఏ సమస్యకు పరిష్కారం: మంగళగిరి, నవులూరు గ్రామాల్లోని కొన్ని సర్వే నంబర్ల భూములు సెక్షన్ 22ఏ(1)(ఋ) కింద నిషేధిత ఆస్తుల జాబితాలో ఉండటంతో 1,622 నివాస గృహాల రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. ఈ నిషేధాన్ని తొలగిస్తూ, ఆర్డీవో ధ్రువీకరించిన 'ప్రాపర్టీ ఎంజాయ్‌మెంట్ సర్టిఫికెట్ల'ను మంత్రి లోకేశ్ లబ్ధిదారులకు అందజేయనున్నారు.

**స్టీల్ బ్రిడ్జ్ నిర్వాసితులకు పట్టాలు:** అమరావతిలో బకింగ్‌హామ్ కాలువపై స్టీల్ బ్రిడ్జ్ నిర్మాణంతో నిర్వాసితులైన 81 మందికి పునరావాసం కింద ఆత్మకూరు లేఅవుట్‌లో ప్లాట్లను కేటాయించారు. వీరికి సంబంధించిన పట్టాలను కూడా ఈ కార్యక్రమంలో పంపిణీ చేయనున్నారు.

**+.నా.వీం.చీశీ.30 కింద క్రమబద్ధీకరణ:** 150 చదరపు గజాల లోపు విస్తీర్ణంలో ఉన్న ప్రభుత్వ స్థలాలను క్రమబద్ధీకరిస్తూ 906 పట్టాలను సిద్ధం చేశారు. వీటిలో తాడేపల్లి మండలానికి 630, మంగళగిరి మండలానికి 276 పట్టాలు ఉన్నాయి. మొత్తంమీద, దశాబ్దాలుగా కాగితాలపై హక్కుల్లేక అభద్రతాభావంతో జీవిస్తున్న వేలాది కుటుంబాలకు మంత్రి లోకేశ్ చొరవతో శాశ్వత భరోసా లభించనుంది.

## పదో తరగతి ఫెయిల్ గ్రేస్ మార్కులతో పాసయ్యా

మొదటిపేజీ తరువాయి - పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ అన్నారు. సోమవారం నెల్లూరు జిల్లాలో జరిగిన 'షైనింగ్ స్టార్ అవార్డ్స్ - 2026' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లాతో కలిసి ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అవార్డులు, మెడల్స్, నగదు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి మంత్రి స్ఫూర్తిదాయక ప్రసంగం చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి నారాయణ తన జీవితంలోని ఆసక్తికర విషయాలను విద్యార్థులతో పంచుకున్నారు. తాను పదో తరగతి ఫెయిల్ అయ్యానని, ఆ తర్వాత గ్రేస్ మార్కులతో పాస్ అయినట్లు వెల్లడించారు. ఆ వైఫల్యమే తనలో పట్టుదలను పెంచిందని, మూడేళ్ల డిగ్రీలో యూనివర్శిటీ టాపర్‌గా నిలిచి స్టాటిస్టిక్స్‌లో గోల్డ్‌మెడల్ సాధించానని గుర్తుచేసుకున్నారు. కష్టపడి చదివితేనే లక్ష్యాలను చేరుకోగలరని విద్యార్థులకు సూచించారు. చదువు పూర్తయ్యాక వీఆర్సీలో రూ.40 జీతానికి పార్ట్‌టైం లెక్చరర్‌గా పనిచేశానని, ప్రభుత్వ అధ్యాపకుడిగా అవకాశం వచ్చినా రాజీనామా చేసి, ట్యూషన్లు చెబుతూ కష్టపడి ఈ స్థాయికి వచ్చానని వివరించారు. యువనేత నారా లోకేశ్ ఆధ్వర్యంలో విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులు వస్తున్నాయని మంత్రి కొనియాడారు. ఈ మార్పులను, అందివస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

## తెలంగాణకు కొత్త మెట్రో

మొదటిపేజీ తరువాయి - సోమవారం రాజ్యసభలో కేంద్ర గృహ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ ఈ విషయాన్ని వెల్లడించారు. బీజేపీ ఎంపీ ఆర్. కృష్ణయ్య అడిగిన ప్రశ్నకు ఆయన రాతపూర్వక సమాధానం ఇచ్చారు. దేశవ్యాప్తంగా 26 నగరాల్లో 1,159 కిలోమీటర్ల మేర మెట్రో నెట్‌వర్క్ ఉందని మంత్రి తెలిపారు. హైదరాబాద్ మెట్రో రైల్ ఫేజ్-1ను రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యం (పీపీపీ) పద్ధతిలో అమలు చేసిందని, ఈ ప్రాజెక్టుకు వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ కింద కేంద్రం రూ.1,204 కోట్లు విడుదల చేసిందని పేర్కొన్నారు. ఇదే క్రమంలో పొరుగున ఉన్న ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం ఎటువంటి మెట్రో ప్రాజెక్టులు అమలులో లేవని, అందువల్ల కేంద్రం నుంచి ఆర్థిక సాయం అందించలేదని కూడా స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో మెట్రో ఫేజ్-2 విస్తరణ కోసం తెలంగాణ ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నిస్తున్న విషయం తెలిసిందే. శంషాబాద్ విమానాశ్రయం, ఐటీ హబ్స్, పాతబస్తీ మరియు శివారు ప్రాంతాలను కలుపుతూ పలు కారిడార్లలో విస్తరణ చేపట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకు సంబంధించిన వివరణాత్మక ప్రాజెక్ట్ నివేదికలను (డీపీఆర్) కూడా ఇప్పటికే కేంద్రానికి సమర్పించింది. ప్రాజెక్టు వ్యయాన్ని చెరిసగం పంచుకోవడానికి లేదా అవసరమైతే పూర్తి వ్యయాన్ని భరించడానికైనా సిద్ధంగా ఉన్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ఇదివరకే ప్రకటించింది. నగరంలో పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీని నియంత్రించేందుకు మెట్రో విస్తరణ అత్యవసరమని ప్రభుత్వం భావిస్తోంది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికే కేంద్ర మంత్రులతో పలుమార్లు చర్చలు జరిపారు. అయితే, కేంద్ర ప్రభుత్వం తాజాగా చేసిన ప్రకటనతో కొత్త ప్రాజెక్టులకు సంబంధించిన తుది అనుమతులు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయని స్పష్టమవుతోంది.c

## తిరుమలకు భారీగా భక్తుల రాక

మొదటిపేజీ తరువాయి - రోజులుగా కొనసాగుతున్న రద్దీ సోమవారం కూడా తీవ్రస్థాయిలో ఉంది. దీంతో వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని మొత్తం 31 కంపార్ట్‌మెంట్లు భక్తులతో పూర్తిగా నిండిపోయాయి. ప్రస్తుతం టోకెన్లు లేని సర్వదర్శనం భక్తులు స్వామివారిని దర్శించుకోవడానికి సుమారు 18 గంటల సమయం పడుతోందని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అధికారులు తెలిపారు. నిన్న ఆదివారం (జులై 19) ఒక్కరోజే 90,956 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. స్వామివారికి 33,046 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. భక్తులు సమర్పించిన కానుకల ద్వారా హుండీ ఆదాయం రూ. 4.05 కోట్లుగా నమోదైంది. రద్దీకి అనుగుణంగా టీటీడీ విస్తృత ఏర్పాట్లు చేసింది. ఆదివారం నాడు టీటీడీ మొత్తం 4.44 లక్షల లడ్డూలను భక్తులకు విక్రయించింది. అదేవిధంగా, 2.94 లక్షల మంది భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేసింది. యాత్రికుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన వైద్య కేంద్రాల ద్వారా 3,708 మందికి వైద్య సేవలు అందించినట్లు టీటీడీ వెల్లడించింది. భక్తుల రద్దీ కొనసాగుతున్నందున, యాత్రికులు ఈ విషయాన్ని గమనించి తమ ప్రయాణాన్ని ప్రణాళిక చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

## విద్యార్థులపై లాఠీచార్జ్... స్పందించిన రాహుల్ గాంధీ

మొదటిపేజీ తరువాయి - విద్యార్థులపై పోలీసులు లాఠీఛార్జ్ చేయడం, బాష్పవాయువు ప్రయోగించడాన్ని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్రంగా ఖండించారు. ఇది అత్యంత అప్రజాస్వామికమని, భారతీయ సంప్రదాయానికి విరుద్ధమని ఆయన కేంద్ర ప్రభుత్వంపై మండిపడ్డారు. సోమవారం పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభమైన తరుణంలో, కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఆధ్వర్యంలో వేలాది మంది విద్యార్థులు, యువకులు ఢిల్లీ వేదికగా నిరసన చేపట్టారు. నీట్ వంటి పోటీ పరీక్షల్లో వరుసగా చోటుచేసుకుంటున్న పేపర్ లీకేజీలు, ఇతర అక్రమాలపై వారు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ వైఫల్యాలకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలని వారు డిమాండ్ చేశారు. జంతర్ మంతర్ నుంచి పార్లమెంట్ వైపు దూసుకెళ్లేందుకు ప్రయత్నించిన నిరసనకారులను పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో చోటుచేసుకున్న తోపులాటతో ఉద్రిక్తత నెలకొనగా, ఆందోళనకారులను చెదరగొట్టేందుకు పోలీసులు లాఠీఛార్జ్ చేసి, టియర్ గ్యాస్ ప్రయోగించారు. ఈ ఘటనపై రాహుల్ గాంధీ ఘాటుగా స్పందించారు. "ఢిల్లీ వీధుల్లో నిరసన తెలుపుతున్న వారు నేరస్థులు కాదు, తమ హక్కుల కోసం పోరాడుతున్న విద్యార్థులు. వారిపై బలప్రయోగం చేయడం తగదు" అని ఆయన హితవు పలికారు. దేశంలో 152 పేపర్ లీకేజీల వల్ల సుమారు 7.5 కోట్ల మంది విద్యార్థుల భవిష్యత్తు దెబ్బతిన్నా, ప్రభుత్వం మాత్రం బాధ్యులను కాపాడటానికే ప్రయత్నిస్తోందని ఆయన ఆరోపించారు.ద

## ఏపీలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ప్రైవేటీకరణ చేస్తున్నారా?

మొదటిపేజీ తరువాయి - సులభతరమైన సేవలు అందించేందుకే 'రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాలు' (=ాఖ) ఏర్పాటు చేస్తున్నామని, దీనిపై జరుగుతున్న దుష్ప్రచారాన్ని వాస్తవాలతో తిప్పికొట్టాలని అధికారులను ఆదేశించారు. సోమవారం సచివాలయంలోని ఆర్టీజీఎస్ కేంద్రంలో వివిధ శాఖల పనితీరుపై సీఎం సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాల ప్రైవేటీకరణ అంశం చర్చకు వచ్చింది. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. "ప్రజలకు మెరుగైన రిజిస్ట్రేషన్ సేవలు అందించడంలో ప్రభుత్వం కట్టుబడి ఉంది. రిజిస్ట్రేషన్ ప్రక్రియను మరింత సులభతరం చేసేందుకే రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాలను స్థాపిస్తున్నాం. ఇది ఎంతమాత్రమూ ప్రైవేటీకరణ కాదు" అని తేల్చిచెప్పారు. డాక్యుమెంట్ రైటర్లు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, డాక్యుమెంట్ రైటర్ల ఉపాధికి ఇబ్బంది లేని విధంగా మార్గాలు చూపెడతామని చంద్రబాబు హామీ ఇచ్చారు. పాస్‌పోర్ట్ సేవా కేంద్రాల మాదిరిగానే ఈ కేంద్రాలు పనిచేస్తాయని, వాటి పనివిధానాన్ని ప్రజలకు వివరించాలని అధికారులకు సూచించారు. పాస్‌పోర్ట్ సేవా కేంద్రాల వల్ల ఆ ప్రక్రియ ఎంత సులువుగా మారిందో, రిజిస్ట్రేషన్ల ప్రక్రియ కూడా అదే విధంగా మారుతుందని ఆయన వివరించారు. కొంతమంది ఉద్దేశపూర్వకంగానే ఈ కేంద్రాలపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని చంద్రబాబు ఆరోపించారు. "వాస్తవాలను ప్రజలకు వివరించి, రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాల వల్ల కలిగే ప్రయోజనాలను తెలియజేయాల్సిన బాధ్యత అధికారులదే. ఇక డాక్యుమెంట్ రైటర్లు కూడా ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. వారి ఉపాధికి ఎలాంటి నష్టం వాటిల్లకుండా ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తాం" అని భరోసా ఇచ్చారు.

**వివిధ అంశాలపై సీఎం కీలక ఆదేశాలు**

సమీక్షలో భాగంగా పలు ఇతర అంశాలపైనా ముఖ్యమంత్రి ఆదేశాలు జారీ చేశారు. 'దీపం-2.0' పథకం లబ్ధిదారులకు సబ్సిడీ చెల్లింపులను క్రమబద్ధంగా చేపట్టాలని, వీలైతే నిర్దిష్ట తేదీల్లో చెల్లింపులు చేసేలా చూడాలని సూచించారు. పౌరసరఫరాల, ఆర్థిక శాఖ అధికారులు సమన్వయంతో పనిచేసి, సాంకేతిక అంశాలను పరిశీలించి దీనిని అమలు చేయాలన్నారు. అదేవిధంగా, కేవలం ప్రభుత్వాన్ని, అధికారులను బద్నాం చేయాలనే ఉద్దేశంతో ప్రజాప్రయోజనం లేని ఫిర్యాదులు చేసే 'లిటిగెంట్ పిటిషనర్ల'ను గుర్తించి కౌన్సిలింగ్ ఇవ్వాలని చంద్రబాబు ఆదేశించారు. "రాష్ట్రవ్యాప్తంగా ఇలాంటి 81 మందిని గుర్తించాం. ఒక్కొక్కరు సగటున 246 పిటిషన్లు దాఖలు చేస్తున్నారు. వీరి వివరాలను జిల్లా కలెక్టర్లకు పంపాలి. ప్రజాప్రయోజనం ఉన్న పిటిషన్లను తప్పక పరిశీలించాలి, కానీ దురుద్దేశంతో వేసే వాటిని గుర్తించాలి" అని అన్నారు. ఆర్థికేతర ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలని, ఆర్థికపరమైన సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తామని తెలిపారు. ఈ ఏడాది ఎల్ నినో ప్రభావంతో రాష్ట్రంలో 49 శాతం వర్షపాత లోటు ఉందని, దీని ప్రభావాన్ని తగ్గించేందుకు ప్రత్యామ్నాయ వ్యూహాలు అన్వేషించాలని సీఎం సూచించారు. రైతుల్లో అవగాహన కల్పించి, మెట్ట పంటల సాగును ప్రోత్సహించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

## పాకిస్థాన్‌ను చుట్టుముట్టిన ఆర్థిక సంక్షోభం

మొదటిపేజీ తరువాయి - ఆర్థిక వ్యవస్థ తీవ్ర ఒడిదొడుకులకు లోనుకావడంతో నిరుపేదల సంఖ్య ప్రమాదకర స్థాయిలో పెరిగిపోయింది. వరుస ఆర్థిక సంక్షోభాలు, అధిక ద్రవ్యోల్బణం, బలహీనమైన వృద్ధి రేటు వంటి కారణాలతో కుటుంబ ఆదాయాలు గణనీయంగా క్షీణించాయి. ఫలితంగా దేశ జనాభాలో దాదాపు 29 శాతం మంది పేదరిక రేఖకు దిగువన జీవిస్తున్నారని ఒక తాజా నివేదిక వెల్లడించింది. 2018-19లో 21.8 శాతంగా ఉన్న పేదరికం, 2024-25 నాటికి 28.9 శాతానికి చేరింది. అంటే కేవలం ఆరేళ్లలోనే పేదరికం 7 శాతం పెరిగింది. హౌస్‌హోల్డ్ ఇంటిగ్రేటెడ్ ఎకనామిక్ సర్వే (హెచ్ఐఈఎస్), పాకిస్థాన్ సోషల్ అండ్ లివింగ్ స్టాండర్డ్స్ మెజర్‌మెంట్ (పీఎస్ఎల్ఎం) డేటా ఆధారంగా 'డాన్' పత్రిక ఈ విశ్లేషణను ప్రచురించింది. దాదాపు ఆరేళ్ల విరామం తర్వాత విడుదలైన ఈ గణాంకాలు.. దేశం ఎదుర్కొన్న బహుళ సంక్షోభాల ప్రభావాన్ని స్పష్టం చేస్తున్నాయి. పట్టణ ప్రాంతాలతో పోలిస్తే గ్రామీణ ప్రాంతాలపై ఈ ప్రభావం మరింత తీవ్రంగా ఉంది. గ్రామీణ పాకిస్థాన్‌లో పేదరికం సుమారు 8 శాతం మేర పెరగగా, పట్టణ ప్రాంతాల్లో ఇది 6 శాతంగా నమోదైంది. పదేపదే తలెత్తిన చెల్లింపుల సంక్షోభం, కోవిడ్-19 మహమ్మారి, నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదల, దీర్ఘకాలిక స్థూల ఆర్థిక సర్దుబాట్లు వంటివి ఈ దుస్థితికి ప్రధాన కారణాలుగా నిలిచాయి. విశ్లేషకులు ఈ పరిస్థితిని జీవన ప్రమాణాల మెరుగుదల విషయంలో 'కోల్పోయిన దశాబ్దం'గా అభివర్ణిస్తున్నారు. గత రెండు సర్వేల మధ్య కాలంలో ద్రవ్యోల్బణాన్ని సర్దుబాటు చేసిన తర్వాత చూస్తే, సగటు కుటుంబ ఆదాయాలు, వినియోగం గణనీయంగా తగ్గినట్లు నివేదిక పేర్కొంది. ఆర్థిక వృద్ధి సానుకూలంగా ఉన్నప్పటికీ, పేదరికం పెరగడం ఆందోళన కలిగించే అంశం. ఈ వృద్ధి ఫలాలు ఎక్కువగా ఉన్నత ఆదాయ వర్గాలకే చేరాయని, దిగువ ఆదాయ వర్గాల వాస్తవ ఆదాయాలు, కొనుగోలు శక్తి తీవ్రంగా దెబ్బతిన్నాయని ఇది సూచిస్తోంది. పేద కుటుంబాలు ఎక్కువగా రోజువారీ వేతనాలపై ఆధారపడతాయి. అధిక ద్రవ్యోల్బణం, ఆర్థిక అంతరాయాల వల్ల ఈ వర్గాలే ఎక్కువగా నష్టపోయాయి. మరోవైపు, సంపన్న వర్గాలు రియల్ ఎస్టేట్, ఆర్థిక పెట్టుబడుల వంటి ఆస్తులను కలిగి ఉండటంతో, ధరల పెరుగుదల ప్రభావాన్ని తట్టుకోగలిగారు. దీంతో దేశంలో ఆదాయ అసమానతలు మరింత పెరిగాయి. ప్రస్తుత భౌగోళిక రాజకీయ అనిశ్చితులు, బాహ్య ఆర్థికపరమైన రిస్కుల మధ్య, పెరుగుతున్న పేదరికాన్ని, విస్తరిస్తున్న అసమానతలను పరిష్కరిస్తూనే ఆర్థిక వృద్ధిని కొనసాగించడం పాకిస్థాన్ ఆర్థిక వ్యవస్థకు పెను సవాలుగా మారింది.

## స్కైరూట్ విజయం వేళ.. రాహుల్ వయసుపై ప్రధాని మోదీ చురకలు

మొదటిపేజీ తరువాయి - ప్రయోగించిన హైదరాబాద్ స్టార్టప్ 'స్కైరూట్ ఏరోస్పేస్'ను అభినందిస్తూనే, రాహుల్ గాంధీ వయసును ఉద్దేశించి ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. సోమవారం పార్లమెంట్ సమావేశాల సందర్భంగా మీడియాతో మాట్లాడిన ప్రధాని, దేశం సాధించిన ఇటీవలి విజయాలను ప్రస్తావించారు. "భారత్ నుంచి తొలి ప్రైవేట్ రాకెట్‌ను ప్రయోగించిన స్కైరూట్ స్టార్టప్ బృందం సగటు వయసు కేవలం 28 ఏళ్లేనని నాకు తెలిసింది. ఇంతటి అతి పిన్న వయస్కులు ఈ ఘనతను సాధించారు. నేను ఇక్కడ 56 ఏళ్ల 'యువకుడి' గురించి మాట్లాడటం లేదు... రోదసిలో త్రివర్ణ పతాకాన్ని రెపరెపలాడించిన 28 ఏళ్ల యువత గురించి మాట్లాడుతున్నాను" అని మోదీ పేర్కొన్నారు. జూన్ మాసంలో 56వ ఏట అడుగుపెట్టిన రాహుల్ గాంధీని ఉద్దేశించే ప్రధాని ఈ వ్యాఖ్యలు చేసినట్లు స్పష్టమవుతోంది. హైదరాబాద్‌కు చెందిన స్కైరూట్ ఏరోస్పేస్ సంస్థ శనివారం 'విక్రమ్-1' రాకెట్‌ను విజయవంతంగా ప్రయోగించిన సంగతి తెలిసిందే. ఈ ప్రయోగం ద్వారా అమెరికా, చైనాల తర్వాత ప్రైవేట్ ఆర్బిటల్ ప్రయోగ సామర్థ్యాలను కలిగిన మూడో దేశంగా భారత్ రికార్డు సృష్టించింది. ప్రపంచవ్యాప్తంగా కేవలం కొన్ని దేశాలకు మాత్రమే పరిమితమైన ఈ ఘనతను భారత యువత సాధించడం దేశానికే గర్వకారణమని మోదీ కొనియాడారు. గత ఏడాది వర్షాకాల సమావేశాల కంటే ముందు ఓ భారత పౌరుడు అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి చేరుకున్న అంశాన్ని కూడా ప్రధాని ఈ సందర్భంగా గుర్తుచేశారు. పార్లమెంట్ సమావేశాలు అర్థవంతంగా, ఫలప్రదంగా సాగాలని, ప్రజా సమస్యలపై లోతైన చర్చలు జరగాలని ఆయన ఆకాంక్షించారు.

## పశ్చిమాసియా యుద్ధంలో మునిగిన ప్రపంచం



మొదటిపేజీ తరువాయి - నెట్టేసింది. అమెరికా వైమానిక దాడులు, ఇరాన్ ప్రతీకార దాడుల నడుమ హర్మూజ్ జలసంధి ద్వారా చమురు రవాణా ప్రస్తుతం యుద్ధానికి ముందు నాటితో పోలిస్తే సుమారు మూడింట రెండు వంతులకు చేరుకుందని ట్రంప్ ప్రభుత్వం తెలిపింది. అదే సమయంలో, ఇరాన్ ఈ ఘర్షణను మరింత విస్తృతం చేస్తూ సూయజ్ కాలువకు కూడా ముప్పు తలపెట్టే అవకాశం ఉందని నాటో మాజీ కమాండర్ హెచ్చరించారు. హర్మూజ్ జలసంధి ద్వారా రవాణా పూర్తిగా స్తంభించిపోయిందనే వార్తలను అమెరికా ఇంధన శాఖ మంత్రి క్రిస్ రైట్ తోసిపుచ్చారు. ప్రస్తుత సగటు ప్రకారం ఈ జలసంధి ద్వారా రోజుకు 70 మిలియన్ బారెళ్ల చమురు, బైపాస్ పైప్‌లైన్ల ద్వారా మరో 70 మిలియన్ బారెళ్ల చమురు సరఫరా అవుతోందని ఆయన వెల్లడించారు. గల్ఫ్ ప్రాంతం నుండి మొత్తం 140 మిలియన్ బారెళ్ల సరఫరా జరుగుతోందని, ఇది గత మార్చి నెలతో పోలిస్తే గణనీయంగా పెరిగిందని చెప్పారు. ఓడల సంఖ్య తగ్గినప్పటికీ, ప్రపంచ మార్కెట్‌కు కొరత లేకుండా చూడటానికి పెద్ద ట్యాంకర్లను ఉపయోగిస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. జోర్డాన్‌లోని అమెరికా సైనిక స్థావరంపై ఇరాన్ జరిపిన దాడిలో ఇద్దరు అమెరికా సైనికులు మరణించగా, మరొకరు గల్లంతయ్యారు. దీనికి ప్రతికారంగా అమెరికా దళాలు ఇరాన్‌పై సరికొత్త దాడులు జరిపాయి. ఇరాన్ సహకారం ఉన్నా లేకపోయినా ఈ జలసంధి ద్వారా రవాణాకు రక్షణ కల్పిస్తామని అమెరికా పేర్కొంది. అయితే డెమొక్రాటిక్ సెనేటర్ మార్క్ వార్నర్ ఈ అంచనాలను తప్పుపట్టారు. యుద్ధం కారణంగా వర్జీనియాలో పెట్రోల్ ధర గాలన్‌కు 2.81 డాలర్ల నుండి 4 డాలర్లకు, డీజిల్ ధర 5 డాలర్లకు పెరిగిందని, ఈ యుద్ధం ఒక పెద్ద విపత్తు అని ఆయన విమర్శించారు. నాటో మాజీ సుప్రీం అలైడ్ కమాండర్, రిటైర్డ్ అడ్మిరల్ జేమ్స్ స్టావ్రిడిస్ ఇరాన్ తదుపరి వ్యూహంపై సంచలన హెచ్చరికలు చేశారు. హర్మూజ్ జలసంధి మాత్రమే కాకుండా, పశ్చిమ ప్రాంతంలో ఉన్న హౌతీ తిరుగుబాటుదారులను వాడుకుని సూయజ్ కాలువను మూసివేయడానికి ఇరాన్ ప్రయత్నిస్తోందని అన్నారు. ఎర్రసముద్రం ఉత్తర సరిహద్దుకు సమీపంలో ఉన్న జోర్డాన్‌పై ఇటీవల జరిగిన దాడులకు, ఈ వ్యూహానికి సంబంధం ఉండవచ్చని ఆయన విశ్లేషించారు. ఇరాన్ కనుక సూయజ్ కాలువను అడ్డుకుంటే ప్రపంచ వాణిజ్యం కోలుకోలేని దెబ్బతింటుందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## ఉక్రెయిన్‌లో కార్గో నౌకపై దాడి



మొదటిపేజీ తరువాయి - ధాన్యంతో వెళుతున్న ఒక పౌర కార్గో నౌకపై క్షిపణి దాడి చేయడంతో, నలుగురు భారతీయులతో సహా పలువురు ప్రాణాలు కోల్పోయారు. నల్ల సముద్రంలో పౌర నౌకల భద్రతకు పొంచి ఉన్న ముప్పును ఈ ఘటన మరోసారి స్పష్టం చేస్తోంది. కాగా, ఈ క్షిపణి దాడి చేసింది రష్యానే అని ఉక్రెయిన్ ఆరోపిస్తోంది. టర్కీకి చెందిన, గినియా-బిస్సావ్ పతాకంతో ప్రయాణిస్తున్న 'గోల్డెన్ లియో' అనే బల్క్ క్యారియర్ నౌక, జూలై 19న ఒడెస్సా పోర్టు నుంచి బయలుదేరిన కొద్దిసేపటికే ఈ దాడికి గురైంది. ప్రమాద సమయంలో నౌకలో మొత్తం 17 మంది సిబ్బంది ఉన్నారు. సహాయక బృందాలు కొందరిని రక్షించి ఒడెస్సాలోని ఆసుపత్రికి తరలించాయి. ఈ ఘటనలో ఉక్రెయిన్ పైలట్‌తో పాటు మరికొందరు మరణించినట్లు అధికారులు వెల్లడించారు. ఈ నౌకలో మొత్తం ఐదుగురు భారతీయులు ఉన్నట్లు భారత విదేశాంగ శాఖ ధ్రువీకరించింది. వారిలో నలుగురు దుర్మరణం పాలవ్వగా, మరొకరు తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఉక్రెయిన్‌లోని భారత రాయబార కార్యాలయం స్థానిక అధికారులతో సమన్వయం చేసుకుంటూ బాధితులకు అవసరమైన సహాయ సహకారాలను అందిస్తోంది. "ఉక్రెయిన్‌లోని తాజా పరిస్థితులను తమ బృందం నిశితంగా పర్యవేక్షిస్తోందని, బాధితులకు అండగా నిలిచేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తున్నామని విదేశాంగ శాఖ పేర్కొంది. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, గాయపడిన వ్యక్తి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించింది. ఈ దాడిని భారత్ తీవ్రంగా ఖండించింది. "వాణిజ్య నౌకలను లక్ష్యంగా చేసుకోవడం, అమాయక పౌర సిబ్బంది ప్రాణాలను ప్రమాదంలోకి నెట్టడం, నౌకాయానం మరియు వాణిజ్య స్వేచ్ఛకు ఆటంకం కలిగించడం అత్యంత విచారకరం. ఇలాంటి దాడులు ఏమాత్రం ఆమోదయోగ్యం కావు" అని మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో స్పష్టం చేసింది.

## 22ఏ భూములపై సర్కార్ కీలక నిర్ణయం



తెలంగాణలో సెక్షన్ 22-ఏ కింద నిషేధిత జాబితాలో ఉన్న భూముల సమస్యలకు చెక్ పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ జాబితాకు సంబంధించి భూ యజమానులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, పెండింగ్ విజ్ఞప్తులను పరిశీలించి పరిష్కరించేందుకు హైలెవల్ కమిటీని ఏర్పాటు చేసింది. దీనిపై ప్రభుత్వం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. ముగ్గురు ఉన్నతాధికారులతో ఈ కమిటీని ఏర్పాటు చేశారు. సీసీఎల్ఏ కమిషనర్ లోకేశ్ కుమార్‌ను కమిటీ ఛైర్మన్‌గా నియమించారు. లా సెక్రటరీ పాపిరెడ్డి, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ ఐజీ రాజీవ్ గాంధీ హనుమంతు సభ్యులుగా ఉంటారు. 22-ఏ నిషేధిత భూముల జాబితాలో ఉన్న అంశాలను కమిటీ సమగ్రంగా పరిశీలించనుంది. భూ యజమానులు ఎదుర్కొంటున్న క్షేత్రస్థాయి సమస్యలు, వారి విజ్ఞప్తులను పరిశీలించి పరిష్కారానికి అవసరమైన కార్యాచరణను రూపొందించనుంది. ఏళ్లుగా నిషేధిత జాబితాలో భూములు ఉండటంతో వాటి క్రయవిక్రయాలు, రిజిస్ట్రేషన్ల విషయంలో పలువురు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీపై భూ యజమానుల్లో ఆశలు నెలకొన్నాయి. సమస్యలను వేగంగా పరిశీలించి పరిష్కారం చూపే దిశగా కమిటీ పనిచేయనుంది. రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఈ నిర్ణయాన్ని ప్రకటించగా, తాజాగా ప్రభుత్వం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది.

# ఖైరతాబాద్ మహాగణపతిని దర్శించుకున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

### ఆత్మీయ ఆహ్వానం పలికిన గణేష్ ఉత్సవ కమిటీ ప్రతినిధులు



**మణుగూరు, సెప్టెంబర్ 19: పోరు తెలంగాణ జిల్లా ప్రతినిధి కూరపాటి దాసు :** తెలంగాణలో అత్యంత వైభవోపేతంగా నిర్వహించే ఖైరతాబాద్ శ్రీశ్రీశ్రీ వరసిద్ధి వినాయక నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా, గణేష్ ఉత్సవ కమిటీ ప్రతినిధుల ఆత్మీయ ఆహ్వానం మేరకు లిపినపాక నియోజకవర్గ శాసనసభ్యులు శ్రీ పాయం వెంకటేశ్వర్లు లి ఖైరతాబాద్ మహాగణపతిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొని గణనాథునికి పూజలు నిర్వహించి, స్వామివారి ఆశీస్సులు అందుకున్నారు. అనంతరం ఉత్సవ కమిటీ ప్రతినిధులు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుని ఆత్మీయంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఖైరతాబాద్ గణేష్ ఉత్సవ కమిటీ చైర్మన్ వాణి , జూబ్లీహిల్స్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కిషోర్ యాదవ్ , ఉత్సవ కమిటీ సభ్యులు రాజు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ జన సమితి పార్టీ పటిష్టత కోసం కృషి చేయండి

### పార్టీ నిర్మాణంలో భాగస్వాములు కావాలి..

### తెలంగాణ జన సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఎమ్మెల్సీ కోదండరాం..



**మహేశ్వరం, సెప్టెంబర్ 19, పోరు తెలంగాణ న్యూస్ ప్రతినిధి :** తెలంగాణ జన సమితి పార్టీ పటిష్టత కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని తెలంగాణ జన సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఎమ్మెల్సీ కోదండరాం తెలిపారు. శనివారం మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా నూతన కమిటీ లకు ఆయన నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీ కోసం పనిచేస్తున్న వారికి సముచితస్థానం కల్పించడం జరుగుతుందని తెలిపారు. పార్టీ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన సూచించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో పార్టీని అన్ని రంగాలలో ముందుకు తీసుకుపోవాలని ఆయన కోరారు. మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా అధ్యక్షునిగా మారం లక్ష్మారెడ్డి, ఉపాధ్యక్షులుగా శ్రీనివాస్, తిరుమలరెడ్డి, వెంకటాచారి, ప్రధాన కార్యదర్శిగా దయాకర్, కోశాధికారిగా సుమంత్ రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా రవికుమార్, దయాకర్ గౌడ్, జాయింట్ సెక్రటరీలుగా లక్ష్మణ్, బాల శివశంకర్ ల ను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్చార్జ్ పల్లె వినయ్ కుమార్, రాష్ట్ర నాయకులు అశోక్ రెడ్డి, ఆంజనేయులు రాష్ట్ర యువజన విభాగం నాయకులు ఎర్ర వీరన్న పాల్గొన్నారు.

# నూతన కోర్టు భవనాన్ని పరిశీలించిన సీఐ రంజిత్ రావు



**పోరు తెలంగాణ ఓదెల ప్రతినిధి రవీంద్ర చారి** : ఓదెల మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీడీవో అనిల్ రెడ్డి ఆధ్వర్యంలో మండల స్థాయి సర్వసభ్య సమావేశంలో ముఖ్యఅతిథిగా సుల్తానాబాద్ సీఐ రంజిత్ రావు పాల్గొన్నారు అనంతరం త్వరలో ప్రారంభం కానున్న నూతన కోర్టు భవన సముదాయాన్ని స్థానిక ఎస్సై సనత్ రెడ్డితో కలిసి పరిశీలించారు.

# అశ్వాపురంలో 'స్వచ్ఛతా హి సేవ' కార్యక్రమం

### బహిరంగ ప్రదేశాల్లో ప్రత్యేక శుభ్రత పనులు...



**భద్రాద్రి కొత్తగూడెం,(పోరు తెలంగాణ -పినపాక నియోజకవర్గం ప్రతినిధి -వల్లెపోగు రాము) అశ్వాపురం: సెప్టెంబర్ 19** సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2 వరకు దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న 'స్వచ్ఛతా హి సేవ' కార్యక్రమంలో భాగంగా శనివారం అశ్వాపురం గ్రామంలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టారు. అశ్వాపురం గ్రామ పంచాయతీ సర్పంచ్ బానోత్ సదర్ లాల్ అధ్యక్షతన గ్రామ పంచాయతీ సిబ్బంది బహిరంగ ప్రదేశాలు శుభ్రత పనులు నిర్వహించారు. పరిసరాల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం, వ్యర్థాలను తొలగించి ఆయా ప్రాంతాలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ బానోత్ సదర్ లాల్ మాట్లాడుతూ.. గ్రామంలో నిరంతరం శుభ్రతను పాటించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకుండా ప్రజలు సహకరించాలని, తడి-పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి పారిశుధ్య సిబ్బందికి అందించాలని సూచించారు. పరిశుభ్రమైన పరిసరాలతో ఆరోగ్యకరమైన వాతావరణం ఏర్పడుతుందని పేర్కొన్నారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని, ప్రజల భాగస్వామ్యంతోనే స్వచ్ఛత కార్యక్రమాలు విజయవంతమవుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ తుళ్లూరు ప్రకాష్ రావు పంచాయతీ కార్యదర్శి యాకూబ్, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు...

# అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న అశ్వాపురం సిఐ సిహెచ్ ఎల్లయ్య





**భద్రాద్రి కొత్తగూడెం,పోరు తెలంగాణ-పినపాక నియోజవర్గ ప్రతినిధి-వల్లెపోగు రాము)అశ్వాపురం: సెప్టెంబర్ 19 :** మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో టీం సిద్ధి వినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో శనివారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని అశ్వాపురం సీఐ సిహెచ్. ఎల్లయ్య ప్రారంభించారు. తొలుత వినాయక మండపంలో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో సీఐ పాల్గొని పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదాన్ని వడ్డించారు. ఈ కార్యక్రమంలో వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారులి.

# 70 వ ఎస్ జి ఎఫ్ గేమ్స్ లో రాణించిన వెల్లుల్ల విద్యార్థులు









**పోరు తెలంగాణ ప్రతినిధి// మెట్ పల్లి :** గత మూడు రోజులుగా జరుగుచున్న స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మెట్ పల్లి మండల స్థాయి పోటీలలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వెల్లుల్ల విద్యార్థులు అండర్ -14,17 బాలుర, బాలికల విభాగంలో ఖో ఖో పోటీలలో మరియు అథ్లెటిక్స్ లలో రాణించి జిల్లా స్థాయి ఎంపికయినట్లు ప్రధానోపాధ్యాయులు గడ్డం శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. పోటీలలో గెలిచిన విద్యార్థులకు గ్రామ సర్పంచ్ తిరుపతి, బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమం లో ఉప సర్పంచ్ శేఖర్ రెడ్డి.జాతీయ క్రీడాకారుడు ముత్యం రెడ్డి,పెటా జిల్లా భాద్యులు అశోక్, ఎస్ జి ఎఫ్ సెక్రటరీ కొమురయ్య, వ్యాయమ ఉపాధ్యాయులు జ్ఞానేశ్వర్, రాజేష్,వివిధ పాఠశాలల క్రీడాకారులు బాలికలు కోకో ప్రథమ స్థానం జడ్పిహెచ్ఎస్ వెల్లుల్ల ద్వితీయ స్థానం జడ్.పి.హెచ్.ఎస్ బాయ్స్ మెట్ పల్లి 14 ఇయర్స్ బాలికలు ప్రథమ స్థానం జడ్పీహెచ్ఎస్ వెల్లుల్ల ద్వితీయ స్థానం టీఎస్ డబ్ల్యూ ఆర్ ఎస్ కోకో 14 ఇయర్స్ బాయ్స్ జడ్.పి.హెచ్.ఎస్ వెల్లుల్ల కబడ్డీ అండర్ 14 ఎంజెపి న్యూ సెకండ్ పెద్దాపూర్ 14 ఇయర్స్ గర్ల్స్ కబడ్డీ బ్రూక్లిన్ ప్రథమ స్థానం ద్వితీయ స్థానం ఆత్మకూర్ 17 ఇయర్స్ కబడ్డీ మైనార్టీ ప్రథమ స్థానం ద్వితీయ స్థానం ఎం జె పి ఓల్డ్ 17 సంవత్సరాల బాలికల కబడ్డీ ప్రథమ స్థానం జడ్పీహెచ్ఎస్ ఆత్మకూర్ సెకండ్ అక్షర వాలీబాల్ 14 ఇయర్స్ బాయ్స్ ప్రథమ స్థానం పెద్దాపూర్ ద్వితీయ స్థానం నిఖిల్ భరత్ ఫోర్టీన్ ఇయర్స్ గర్ల్స్ వాలీబాల్ ప్రథమ స్థానం ఆత్మకూర్ ద్వితీయ స్థానం జగ్గాసాగర్ వాలీబాల్ 17 ఇయర్స్ ప్రథమ స్థానం పెద్దాపూర్ ద్వితీయ స్థానం ఎం జె పి న్యూ వాలీబాల్ గర్ల్స్ 17 ఇయర్స్ ప్రథమ స్థానం జడ్పిహెచ్ఎస్ జగ్గాసాగర్ ద్వితీయ స్థానం బ్రూక్లిన్. పాల్గొనడం జరిగింది

# మహాత్మ జ్యోతిరావ్ పూలే స్కూల్ ని ఆకస్మిక తనిఖీ చేసిన సీనియర్ సివిల్ జడ్జి





**పోరు తెలంగాణ ప్రతినిధి // మెట్ పల్లి** : మెట్ పల్లి మండల లీగల్ సర్వీసెస్ ఛైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి ఆర్. అరుణ్ కుమార్ శనివారం పట్టణంలోని మహాత్మ జ్యోతిరావ్ పూలే బాలుర హాస్టల్, బీర్పూర్ ఎట్ మెట్ పల్లిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాస్టల్లో ఉన్న కిచెన్, బాత్రూం, స్టోర్ రూమ్, తరగతి గదులు మరియు వసతి రూములను ఆకస్మికంగా తనిఖీ చేసి, హాస్టల్లో ఉన్న అపరిశుభ్రత మరియు అసౌకర్యాల పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థులు వ్యక్తిగతంగా ఫిర్యాదు చేసిన వివిధ సమస్యలపై నోట్ ప్యాడ్ రాసుకున్నారు. విద్యార్థులకు కనీస వసతులు, సౌకర్యాలు కూడా లేకపోవడం పట్ల ఆయన అసహనం వ్యక్తం చేస్తూ, హాస్టల్లో నెలకొన్న పరిస్థితులపై త్వరలోనే జిల్లా, రాష్ట్ర ఉన్నత అధికారులకు నివేదిక పంపి విద్యార్థుల సమస్యలు పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. అలాగే పాఠశాలలో నెలకొన్న సమస్యలపై సలహాలు, సూచనలు తో కూడిన ప్రిన్సిపల్ దీకొండ వాణి ఇచ్చిన వినతి పత్రం స్వీకరించారు. ప్రస్తుత స్కూల్ బిల్డింగ్ ని మరుతి నగర్ లోని ఖాళీగా ఉన్న స్కూల్ బిల్డింగ్ లోకి మార్చడానికి ప్రయత్నిస్తే బాగుంటుందని ఉపాధ్యాయులు సూచించారు. ఇట్టి కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఏలేటి రాంరెడ్డి, ప్రధాన కార్యదర్శి నల్ల రాజేందర్, కల్చరల్ కార్యదర్శి కాజీపేట స్రవంతి, లోక్ అదాలత్ మెంబెర్ వద్దేపల్లి శ్రీనివాసన్, న్యాయవాదులు వెంకట నరసయ్య, దయాకర్ వర్మ, భానుమూర్తి, తోగిటి రాజశేఖర్, ఎలుముల రాంబాబు, గజభీంకర్ వెంకటేష్ ఉన్నారు.

# రాజ్యాంగాన్ని అవమానించిన ఘటనపై చర్యలు

### తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి,పోలీసు శాఖకు మాల సంఘాల జేఏసీ అధ్యక్షులు చెట్టి సురేష్ కృతజ్ఞతలు



**భద్రాద్రి కొత్తగూడెం, పోరు తెలంగాణ-పినపాక నియోజకవర్గం (ప్రతినిధి-వల్లెపోగు రాము) అశ్వాపురం సెప్టెంబర్ 19:-** భారత రాజ్యాంగాన్ని అవమానించేలా వ్యవహరించిన హమారా ప్రసాద్పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ దళిత సంఘాలు, మాల సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన కార్యక్రమాలకు స్పందించిన తెలంగాణ ప్రభుత్వం మరియు పోలీసు శాఖకు పినపాక నియోజకవర్గ మాల సంఘాల జేఏసీ అధ్యక్షులు చెట్టి సురేష్ కృతజ్ఞతలు తెలిపారు...రాజ్యాంగ పరిరక్షణ కోసం దళిత సంఘాలు శాంతియుతంగా నిరసనలు చేసారని తెలియజేసారు ..రాజ్యాంగాన్ని గౌరవించడం, దాని విలువలను కాపాడటం ప్రతి పౌరుడి బాధ్యత అని, రాజ్యాంగాన్ని కించపరిచే ఘటనలు ఎవరు అవలంబించిన సహించబోమని పేర్కొన్నారు...ఈ అంశంపై స్పందించి చట్ట ప్రకారం చర్యలు తీసుకున్న తెలంగాణ ప్రభుత్వం, పోలీసు ఉన్నతాధికారులు మరియు పోలీసు సిబ్బందికి మాల సంఘాల జేఏసీ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేసింది..అలాగే రాజ్యాంగ పరిరక్షణ కోసం నిరసన కార్యక్రమాల్లో పాల్గొన్న దళిత సంఘాల నాయకులు, కార్యకర్తలు మరియు ప్రజలందరికీ మాల సంఘాల జేఏసీ తరపున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేసారు...ఈ కార్యక్రమంలో మాల సంఘాల జేఏసీ నాయకులు వేల్పుల నరేష్, ముదిగొండ రామకృష్ణ,బూర్గుల కరుణాకర్,ధ్రువ కుమార్,దాసరి రవి తదితరులు పాల్గొన్నారు.

# గణేష్ నిమజ్జనాల్లో డీజేలకు నో ఎంట్రీ....!

### ప్రశాంత వాతావరణంలో నిమజ్జనాలు నిర్వహించాలి..

### నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు...!!

### సిఐ సిహెచ్ ఎల్లయ్య




**భద్రాద్రి కొత్తగూడెం, (పోరు తెలంగాణ -పినపాక నియోజవర్గ ప్రతినిధి వల్లేపోగు రాము) అశ్వాపురం: సెప్టెంబర్ 19 :** గణేష్ నిమజ్జనోత్సవాలను ప్రశాంతంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు అశ్వాపురం పోలీసులు అప్రమత్తమయ్యారు. నిమజ్జన కార్యక్రమాల్లో డీజే సౌండ్ వినియోగానికి అనుమతి లేదని అశ్వాపురం సిఐ సిహెచ్ ఎల్లయ్య స్పష్టం చేశారు. శబ్ద కాలుష్యానికి కారణమయ్యే విధంగా డీజేలు, భారీ సౌండ్ సిస్టమ్స్ వినియోగిస్తే నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. "భక్తి పేరుతో నిబంధనలు ఉల్లంఘించొద్దు.. గణనాథుడి నిమజ్జనం ఆనందంగా జరగాలి.. అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలి" అని పోలీసులు సూచించారు. "పండుగ అందరిదీ.. ప్రశాంతత బాధ్యత కూడా అందరిదే" అని పేర్కొంటూ, యువత అత్యుత్సాహానికి దూరంగా ఉండాలని, రహదారులపై ప్రజలకు, వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా నిమజ్జన ఊరేగింపులు నిర్వహించాలని సూచించారు. అదేవిధంగా మద్యం సేవించి ఊరేగింపుల్లో పాల్గొనడం, ట్రాఫిక్కు అంతరాయం కలిగించడం, అనుమతులు లేకుండా సౌండ్ సిస్టమ్స్ వినియోగించడం వంటి చర్యలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు. "గణేష్ నిమజ్జనం భక్తికి ప్రతీక కావాలి.. భయానికి కాదు." "డీజే శబ్దం కాదు.. గణనాథుడి నామస్మరణే మార్మోగాలి." "నిబంధనలు పాటిద్దాం.. నిమజ్జనాన్ని ప్రశాంతంగా పూర్తి చేద్దాం." నిమజ్జన కార్యక్రమాలు సజావుగా జరిగేలా పోలీసులకు సహకరించాలని గణేష్ ఉత్సవ కమిటీలు,నిర్వాహకులకు, భక్తులకు అశ్వాపురం సీఐ విజ్ఞప్తి చేశారు.

# నెక్కొండలో లక్ష మోదకాలతో గణనాథుడికి అపూర్వ అర్చన

### శాకంబరీ రూపంలో దర్శనమిచ్చిన వినాయకుడు,

### వైభవంగా కుంకుమ పూజలు





**పోరు తెలంగాణ నెక్కొండ, సెప్టెంబర్ 19:** గణపతి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని నెక్కొండ పట్టణం భక్తి పారవశ్యంతో పులకించింది. నెక్కొండ ఆర్యవైశ్య సంఘం పట్టణ, మండల శాఖలు, వాసవి కళ్యాణ మండపం శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఆర్యవైశ్య గణపతి మండపంలో లక్ష మోదక ఉండ్రాళ్ల అభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన కన్నుల పండుగగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా గణనాథుడిని శాకంబరీ రూపంలో వివిధ రకాల కూరగాయలతో అద్భుతంగా అలంక రించారు. ఉదయం నుంచే మండపం భక్తులతో కిటకిటలాడింది. ప్రత్యేకంగా నిర్వహించిన గణపతి శోభాయాత్రలో మహిళలు సంప్రదాయ దుస్తుల్లో మంగళహారతులతో, భక్తి సంకీర్తనలతో పాల్గొని అందరినీ ఆకట్టుకున్నారు. ఆర్యవైశ్య సంఘం చేపట్టే ప్రతి కార్యక్రమం సంప్రదాయ విలువలకు అద్దం పడుతోందని పలువురు కొనియాడారు. అనంతరం జరిగిన పూజా కార్యక్రమంలో శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయ అర్చకులు బివిఎన్ శాస్త్రి, వేద జ్యోతిష పండితులు శ్రవణ శాస్త్రి మాట్లాడుతూ లక్ష ఉండ్రాళ్ల అర్చన విశిష్టతను వివరించారు. "మోదకం అంటే పరమానందానికి ప్రతీక. వేదాల్లో గణపతిని 'మోదకప్రియః' అంటారు. ఉండ్రం పైనున్న బియ్యపు పొర అహంకారానికి, లోపలి పూర్ణం పరమాత్మ తత్వానికి ప్రతీక. అజ్ఞానాన్ని వీడి నిర్మల భక్తిని స్వామికి అర్పించడమే ఈ అర్చన అంతరార్థం" అని తెలిపారు. అమ్మవారికి చేసే కుంకుమార్చన వల్ల గృహాల్లో సౌభాగ్యం, ఐశ్వర్యం, ప్రశాంతత వెల్లివిరుస్తాయన్నారు. బుద్ధి, సిద్ధిలకు అధిపతి అయిన గణపతి, ఐశ్వర్య ప్రదాయిని అయిన జగన్మాత అనుగ్రహం ఒకే మండపంలో లభించడం భక్తుల పూర్వజన్మ సుకృతమన్నారు. ఆర్యవైశ్య సమాజం ఎల్లప్పుడూ ధర్మానికి, దైవారాధనకు, సేవా కార్యక్రమాలకు ముందుంటుందని అభినందించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు తాటిపల్లి శివకుమార్, పట్టణ అధ్యక్షుడు దొడ్డ విజయకుమార్, వాసవి కళ్యాణ మండపం అధ్యక్షుడు తాళ్లూరి నరసింహస్వామి, మాజీ సొసైటీ చైర్మన్ మారం రాము, నంగునూరి భాస్కరరావు, శివయ్య, దొడ్డ నగేష్, దుబ్బ నాగరాజు, కొమురవెల్లి సతీష్, వేములపల్లి శ్రవణ్, నంగునూరు కృష్ణమూర్తి, చిదురాల వీరభద్రయ్య, వినీత్ తదితరులు పాల్గొన్నారు.

# మణుగూరు ఆర్టీసీ డిపో నుండి నూతన బస్సు సర్వీసులు



**భద్రాద్రి కొత్తగూడెం,పోరు తెలంగాణ-పినపాక నియోజకవర్గం ప్రతినిధి-వల్లెపోగు రాము)మణుగూరు సెప్టెంబర్ 19:-** పరిసర ప్రాంతాల ప్రజలు,భక్తుల సౌకర్యార్థం తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ మణుగూరు డిపో నుండి హైదరాబాద్, తిరుపతిలకు నూతన బస్సు సర్వీసులను పునరుద్ధరించినట్లు డిపో మేనేజర్ కె.శ్యాంసుందర్ తెలిపారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడారు. ఈ నూతన సర్వీసులు మణుగూరు నుండి బయలుదేరి ఏటూరునాగారం,హనుమకొండ మీదుగా హైదరాబాద్ బిహెచ్ఈఎల్కు చేరుకుంటాయన్నారు. మణుగూరు నుండి ప్రతిరోజు రాత్రి 07:00, 08:00, 09:00 గంటలకు హైదరాబాద్కు బస్సులు అందుబాటులో ఉంటాయని, తిరుగు ప్రయాణంలో హైదరాబాద్ నుండి రాత్రి 08:00, 08:45, 09:00 గంటలకు మణుగూరుకు బయలుదేరుతాయని తెలిపారు. అలాగే తిరుపతి వెళ్లే భక్తుల కోసం ప్రతిరోజు మధ్యాహ్నం 03:00 గంటలకు నేరుగా తిరుపతికి సర్వీసు నడుస్తుందని వివరించారు. ఈ రవాణా సౌకర్యాన్ని మణుగూరు, అశ్వాపురం, పినపాక, కరకగూడెం మండలాల ప్రజలు, విద్యార్థులు, భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సీట్ల ముందస్తు రిజర్వేషన్ కోసం స్థానిక బస్టాండ్ లేదా ఆర్టీసీ వెబ్సైట్ను సంప్రదించవచ్చని ఆయన తెలిపారు.

# ప్రజల సమస్యలపై ప్రశ్నించిన జిల్లా సర్పంచుల సంఘం వైస్ ప్రెసిడెంట్ దాసరి మణిదీపక్



**పోరు తెలంగాణ మంచిర్యాల జిల్లా, సెప్టెంబర్ 19 :** భీమారం మండల కేంద్రంలో ఈరోజు నిర్వహించిన మండల స్థాయి సమీక్ష సమావేశంలో మంచిర్యాల జిల్లా సర్పంచుల సంఘం వైస్ ప్రెసిడెంట్, ధర్మారం గ్రామ సర్పంచ్ మణిదీపక్ దాసరి పాల్గొని మండలంలోని 11 గ్రామ పంచాయతీల ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి ప్రశ్నించారు. ప్రజాపాలన అని చెప్పుకునే ప్రభుత్వం గ్రామాల అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం కనీస మౌలిక వసతులు కల్పించాల్సిన బాధ్యత ఉందని ఆయన అన్నారు. అయితే గ్రామ పంచాయతీలకు సరైన నిధులు అందకపోవడంతో అనేక అభివృద్ధి పనులు నిలిచిపోతున్నాయని, దీనిపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ముఖ్యంగా ధర్మారం గ్రామ పంచాయతీ పరిధితో పాటు భీమారం మండలంలోని 11 గ్రామ పంచాయతీల పరిధిలో రైతులు విద్యుత్ సమస్యలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. పంటలకు కీలకమైన సమయంలో తరచూ విద్యుత్ కోతలు విధించడం, త్రీ-ఫేజ్ విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఏర్పడటంతో అన్నదాతలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. రైతులకు అవసరమైన సమయంలో నిరంతరాయంగా విద్యుత్ సరఫరా జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా అధికారులు ప్రోటోకాల్‌ను పాటిస్తూ, ప్రజాప్రతినిధులను గౌరవిస్తూ పారదర్శకంగా పనిచేయాలని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ఎలాంటి వివక్షకు తావులేకుండా అన్ని గ్రామ పంచాయతీలకు సమాన ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. ప్రత్యేకంగా ఎస్సీ, ఎస్టీ ప్రజలు అధికంగా నివసించే గ్రామ పంచాయతీలతో పాటు దళిత సర్పంచులు ప్రాతినిధ్యం వహిస్తున్న గ్రామ పంచాయతీలపై ఎలాంటి వివక్ష లేకుండా అభివృద్ధి పనులు, నిధులు అందించాలని అధికారులను కోరారు. గ్రామాల అభివృద్ధి విషయంలో రాజకీయాలు, వ్యక్తిగత అభిప్రాయాలకు తావులేకుండా పారదర్శకంగా వ్యవహరించాలని ఆయన స్పష్టం చేశారు.

# డీజే కు అనుమతి లేదు.. ప్రజల సమస్యకు పరిష్కారం చూపిన మాచారెడ్డి పోలీసులు

డీజే కోసం చెల్లించిన రూ.60,000/- అడ్వాన్స్‌ను తిరిగి ఇప్పించిన పోలీసులు

మాచారెడ్డి ఎస్ఐ విజయ్ చొరవతో సమస్యకు పరిష్కారం

నిబంధనలు చెప్పడమే కాదు.. ప్రజల సమస్యకు పరిష్కారం చూపడమే పోలీసుల బాధ్యత..




**కామారెడ్డి జిల్లా ప్రతి నిధి:సెప్టెంబర్ 19.(పోరు తెలంగాణ న్యూస్:) :** కామారెడ్డి జిల్లా మాచారెడ్డి మండలం అక్కాపూర్ గ్రామానికి చెందిన ఆదర్శ్ యూత్ గణపతి మండల అధ్యక్షుడు గడ్డం శ్రీకాంత్ , గణేష్ నిమజ్జనం సందర్భంగా డీజే ఏర్పాటు కోసం సుమారు 15 రోజుల క్రితం ఎల్లారెడ్డిపేట మండలం రాజన్నపేట గ్రామానికి చెందిన “లడ్డు === డీజే ” నిర్వాహకుడికి రూ. 60,000/- అడ్వాన్స్‌గా చెల్లించారు. గణేష్ ఉత్సవాల సందర్భంగా డీజే వినియోగానికి అనుమతి లేని నేపథ్యంలో, తాను చెల్లించిన అడ్వాన్స్ మొత్తాన్ని తిరిగి ఇప్పించాలని గడ్డం శ్రీకాంత్ మాచారెడ్డి పోలీసులను ఆశ్రయించారు. విషయాన్ని గుర్తించిన మాచారెడ్డి ఎస్ఐ విజయ్ కొండ డీజే నిర్వాహకుడితో మాట్లాడి, శ్రీ గడ్డం శ్రీకాంత్ ముందుగా చెల్లించిన రూ. 60,000/- అడ్వాన్స్ మొత్తాన్ని పూర్తిగా తిరిగి ఇప్పించారు. ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా నిబంధనలను కఠినంగా అమలు చేస్తూనే, ప్రజలకు ఎదురయ్యే సమస్యలకు మానవీయ దృక్పథంతో పరిష్కారం చూపుతున్నామని పోలీసులు తెలిపారు.నిబంధనలు చెప్పడమే కాదు.. ప్రజల సమస్యకు పరిష్కారం చూపడమే పోలీసుల బాధ్యత అనే సందేశాన్ని మాచారెడ్డి పోలీసులు మరోసారి చాటిచెప్పారు.

# వినాయక నిమజ్జనానికి పటిష్ట భద్రతా ఏర్పాట్లు -డీసీపీ బి.రాంరెడ్డి





**పోరు తెలంగాణ,పెద్దపల్లి, సెప్టెంబర్ 19 :** వినాయక నిమజ్జనానికి పటిష్ట భద్రత ఏర్పాట్లు చేసామని,వినాయక నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంత వాతావరణంలో జరుపుకొవాలని డీసీపీ రాంరెడ్డి అన్నారు. పెద్దపల్లి పోలీసుల ఆధ్వర్యంలో పట్టణంలోని డీసెంట్ ఫంక్షన్ హాల్‌లో వినాయక మండపాల నిర్వాహకులతో, ఉత్సాహ కమిటీ సభ్యులతో, అన్ని సంబందిత ప్రభుత్వ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి పెద్దపల్లి డీసీపీ బి. రామ్ రెడ్డి, పెద్దపల్లి ఏసీపీ జి. కృష్ణ, పోలీస్ అధికారులు, తహసీల్దార్ ,మున్సిపల్ కమిషనర్, విద్యుత్ శాఖ అధికారులు, ఇరిగేషన్ శాఖ ఏఈ, మత్స్యశాఖ, వైద్య ఆరోగ్య శాఖ, ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులు హాజరయ్యారు.ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ.. వినాయక నిమజ్జన శోభాయాత్ర సందర్భంగా ప్రజలు, భక్తులు, మండపాల నిర్వాహకులు పోలీసులకు పూర్తిగా సహకరించాలని సూచించారు. నిమజ్జన కార్యక్రమం సజావుగా జరిగేలా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, పోలీసుల సూచనలు ,భద్రతా నిబంధనలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. మండపాల నిర్వాహకులు నిమజ్జన శోభాయాత్ర సమయంలో క్రమశిక్షణ పాటించాలని, నిర్ణయించిన మార్గాలు , నిబంధనలకు అనుగుణంగా శోభాయాత్ర నిర్వహించాలని సూచించారు. ప్రజలకు, వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పోలీసులతో సమన్వయం చేసుకోవాలని తెలిపారు.

**మినీ ట్యాంక్ బండ్ నిమజ్జన ప్రాంతం పరిశీలన**

సమావేశం అనంతరం డీసీపీ బి. రామ్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీస్, రెవెన్యూ, మున్సిపల్, ఇరిగేషన్ తదితర శాఖల అధికారులు మినీ ట్యాంక్ బండ్ నిమజ్జన ప్రాంతాన్ని సందర్శించి భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. నిమజ్జనం సందర్భంగా భక్తులు ప్రమాదవశాత్తు నీటిలోకి వెళ్లకుండా అవసరమైన బారికేడింగ్, లైటింగ్, పోలీస్ బందోబస్తు, రాకపోకల నియంత్రణ, విద్యుత్ భద్రత వంటి అంశాలపై అధికారులతో చర్చించారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించేలా రక్షణ చర్యలు, అవసరమైన సిబ్బంది , ఇతర సౌకర్యాలను అందుబాటులో ఉంచాలని సంబంధిత శాఖల అధికారులకు సూచించారు. నిమజ్జన సమయంలో భారీగా ప్రజలు తరలివచ్చే అవకాశం ఉన్నందున ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్, వాహనాల రాకపోకలు, అత్యవసర వాహనాలకు మార్గం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులు నిర్ణయించారు. నిమజ్జన ప్రాంతంలో ప్రజల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.వినాయక నిమజ్జన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రజలు, భక్తులు, మండపాల నిర్వాహకులు పోలీసులకు సహకరించాలని అధికారులు కోరారు. ప్రజల భద్రతే ప్రధాన లక్ష్యంగా అన్ని శాఖల సమన్వయంతో నిమజ్జన ఏర్పాట్లు చేపడుతున్నట్లు డీసీపీ తెలిపారు.

# గిరిజనుల అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ పెద్దపీట

గిరిజనులకు కాంగ్రెస్ పార్టీలోనే న్యాయం..

రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి మహేశ్వరం మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు నేనావత్ రాజు నాయక్..



**మహేశ్వరం, సెప్టెంబర్ 19, పోరు తెలంగాణ న్యూస్ ప్రతినిధి :** గిరిజనులకు కాంగ్రెస్ ప్రభుత్వంలో పెద్దపీట వేయడం జరుగుతుందని రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి మహేశ్వరం మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు నేనావత్ రాజు నాయక్ తెలిపారు. శనివారం తుక్కుగూడలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజు నాయక్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీపై బీఆర్ఎస్ గిరిజన నాయకులు చేస్తున్న దుష్ప్రచారాన్ని అయన ఖండించారు. అటవి ప్రాంతంలో నివసించే గిరిజన బిడ్డలను వారి బాధలను చూసి గత కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్టీ జాబితాలో చేర్చడం జరిగిందని ఆయన గుర్తు చేశారు. గిరిజనులకు సాగు చేసుకోవడానికి భూమి, ఉండడానికి ఇండ్లను ఇచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందని పేర్కొన్నారు. త్యాగాల కాంగ్రెస్ ను కొంతమంది గిరిజన బిఆర్ఎస్ నాయకులు ఎమ్మెల్యే సబితమ్మ మెప్పుకోసం కాంగ్రెస్ ను విమర్శించడం సిగ్గుచేటని ఆయన ధ్వజమెత్తారు. ప్రజాపాలనలో సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో నియోజకవర్గంకాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి మాజీ ఎమ్మెల్యే కిచ్చన్న గారి లక్ష్మారెడ్డి ప్రత్యేక చొరవతో నియోజకవర్గంలో ఉన్న గిరిజన తండాలను అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని ఆయన ప్రశంసించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రతి తండాకు రోడ్లు, డ్రైనేజీ, ఉచిత విద్యుత్తు, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు అనేక సంక్షేమ పథకాలను మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో మహేశ్వరం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వట్టెల మల్లేష్ యాదవ్, సీనియర్ నాయకులు కాకి ఈశ్వర్ ముదిరాజ్, కూన యాదయ్య, ఆవుల యాదయ్య, గిరిజన నాయకులు కృష్ణా నాయక్, పాండు నాయక్, ఆంధ్యా నాయక్, దేవేందర్ నాయక్, భాస్కర్ నాయక్, రవీందర్ నాయక్, రవి, నరసింహా నాయక్, హరిచంద్, నాగేందర్, లక్ష్మణ్ నాయక్, రవి నాయక్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల విద్యుత్ మీటర్లపై అధికారులను ప్రశ్నించిన సర్పంచులు








**పోరు తెలంగాణ ఓదెల ప్రతినిధి రవీంద్ర చారి :** ఓదెల మండల కేంద్రంలోని జెడ్పీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సర్వసభ్య సమావేశం పలు అంశాలపై వాడివేడిగా సాగింది. గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారులు, సర్పంచులు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. మండల ప్రత్యేక అధికారి మల్లేష్ మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి పనుల్లో జాప్యం లేకుండా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రతి 45 రోజులకు సమావేశమై సమస్యల పరిష్కారంపై పురోగతిని సమీక్షించుకోవాలని తెలిపారు అలాగే మండలంలోని ఐదు గ్రామాలకు మహిళా సంఘ భవనాలు మంజూరైనట్లు పేర్కొన్నారు..ఎంపీడీవో అనిల్‌రెడ్డి మాట్లాడుతూ వర్షపు నీటిని ఒడిసి పట్టేందుకు జలసిరి కార్యక్రమం ద్వారా ప్రతి ఇంటి సమీపంలో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలని కోరారు. భూగర్భ జలాల పరిరక్షణకు ఇవి దోహదపడతాయని తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి పెన్షన్ల కోసం 885 దరఖాస్తులు వచ్చినట్లు వెల్లడించారు. తహసీల్దార్ వనజ నాయక్ మాట్లాడుతూ ఎస్ఐఆర్ ప్రక్రియలో ఓటర్ల వివరాల పరిశీలన జరుగుతోందని తెలిపారు. ఓటర్లకు సంబంధించిన సరైన ధ్రువపత్రాలు అందుబాటులో లేకుంటే నిబంధనల మేరకు తదుపరి చర్యలు చేపడతామని పేర్కొన్నారు. వ్యవసాయ అధికారి భాస్కర్ మాట్లాడుతూ రైతులు సాగు చేసిన పంటల వివరాలను తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని సూచించారు. మిషన్ భగీరథ నీటి సరఫరాపై కనగర్తి, కొమిర గ్రామాల సర్పంచులు సమస్యలను ప్రస్తావించారు. పైప్‌లైన్ లీకేజీల కారణంగా కొన్ని ప్రాంతాలకు నీరు అందడం లేదని తెలిపారు. కొమిర సర్పంచ్ గోలి లింగారెడ్డి విద్యుత్ శాఖ పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసే సమయంలో స్థానిక సర్పంచులకు ముందస్తు సమాచారం ఇవ్వాలని కోరారు. విద్యుత్ సమస్యలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సర్పంచుల ఫోరం అధ్యక్షుడు పిట్టల రవికుమార్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్లకు విద్యుత్ మీటర్ల మంజూరు, ఏర్పాటులో జాప్యాన్ని నివారించాలని కోరారు. వినాయక నిమజ్జన ఏర్పాట్లపై సీఐ రంజిత్‌రావు మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో నిమజ్జన కార్యక్రమాలు ప్రశాంతంగా జరిగేలా నిర్వాహకులు, ప్రజలు పోలీసులకు సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ సనత్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ ఆళ్ల సుమన్‌రెడ్డి, సర్పంచులు కనికిరెడ్డి సతీష్, జిల రాజు, గంగిశెట్టి ప్రభాకర్, తంగెళ్ల నరసింహారెడ్డి, చొప్పరి సంధ్యారాణి, రాగిడి మంగా శ్రీనివాస్‌రెడ్డి, పుప్పాల స్వప్న శంకర్, నిమ్మ నాయక్, బొంగోని రమ శ్రీనివాస్‌తో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ



**కామారెడ్డి జిల్లా ప్రతి నిధి:సెప్టెంబర్ 19.(పోరు తెలంగాణ న్యూస్:) :** కామారెడ్డి జిల్లా దోమకొండ మండల కేంద్రంలోని గోసంగి వాడ ప్రాంతంలో నిరుపేదలైన కుటుంబాలకు దోమకొండ గడి కోట ట్రస్ట్ ఆధ్వర్యంలో దుప్పట్ల ను సర్పంచ్ నరసయ్య పంపిణీ చేశారు. ప్రతి వాడకు నిరుపేదలైన కుటుంబాలకు దుప్పట్లు పంపిణీ చేయనట్లు నిర్వాహకులు బాబ్జి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ బొమ్మెర శ్రీనివాస్. మాజీ జెడ్పిటిసి సభ్యుడు తిరుమల్ గౌడ్. పట్టణ అధ్యక్షుడు మధు. వార్డు సభ్యులు పాలకుర్తి శేఖర్. మల్లేష్ యాదవ్. నర్సింలు. మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు పిన్నెం నాగేంద్ర వర్మ. నాయకులు సుధాకర్ యాదవ్. అశోక్ యాదవ్. దేవరాజ్ యాదవ్. గణేష్ పిప్పిరి బాలరాజ్ తో పాటు కాలనీవాసులు గ్రామస్తులు పాల్గొన్నారు.

# బోదేపల్లి గ్రామాన్ని సందర్శించిన జిల్లా పంచాయతీ అధికారి



**పోరు తెలంగాణ ప్రతినిధి (భూమేశ్వర్) :** బాల్కొండ మండలంలోని బోదేపల్లి గ్రామాన్ని జిల్లా పంచాయతీ అధికారి సందర్శించారు. ఈ సందర్భంగా జలసిరి పనులు, నర్సరీ కంపోస్టు షెడ్డు,ముఖ్యంగా గ్రామ పంచాయతీ రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ గంగా మోహన్, సర్పంచ్ నీరటీ రాజమణి,ఉప సర్పంచ్ అఖిలేష్, కార్యదర్శి విపుల్ కుమార్,వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# స్వర్ణగంటి కమలమ్మ జ్ఞాపకార్థ కూడిక కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు



**మహేశ్వరం, సెప్టెంబర్ 19, పోరు తెలంగాణ న్యూస్ ప్రతినిధి :** కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గం సమన్వయకర్త ఇందిరమ్మ కమిటీ సభ్యుడు స్వర్ణగంటి సుభాష్ మాతృమూర్తి స్వర్ణగంటి కమలమ్మ జ్ఞాపకార్థ కూడిక కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొని ఘణ నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు స్వర్ణగంటి కమలమ్మ సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం మండల అధ్యక్షుడు మల్లేష్ యాదవ్, మహేశ్వరం మాజీ సర్పంచ్, మాజీ ఎంపిటిసి సభ్యులు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కూన యాదయ్య, తెలంగాణ ముదిరాజ్ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కాకి ఈశ్వర్ ముదిరాజ్, ఫ్యూచర్ సిటీ జేఏసీ చైర్మన్ వత్తుల రఘుపతి, శివగంగ ఆలయ కమిటీ చైర్మన్ అల్లే కుమార్, మహేశ్వరం ముస్లిం వెల్ఫేర్ సొసైటీ మండల అధ్యక్షులు కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం పట్టణ శాఖ ప్రధాన కార్యదర్శి షేక్ హాజీ బాబా, కాంగ్రెస్ పార్టీ మైనార్టీ డిపార్ట్మెంట్ మహేశ్వరం మండల్ చైర్మన్ మహమ్మద్ ఇర్షాద్, మహేశ్వరం పట్టణ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు స్వర్ణ గంటి ఆకాష్, మన్సాన్పల్లి గ్రామ శాఖ అధ్యక్షులు శ్రీశైలం, గంగారం గ్రామ శాఖ అధ్యక్షులు రవి నాయక్ నాయకులు కాకి మల్లేష్ ముదిరాజ్, పినమోని శ్రీకాంత్ ముదిరాజ్, దత్తు నాయక్, కటికల శ్రీహరి ముదిరాజ్ పాల్గొన్నారు.

# మాదిగ రాజకీయ పోరాట సమితి ఎమ్మార్పీఎస్, అంబేద్కర్ యువజన సంఘాల ఆధ్వర్యంలో పాలాభిషేకం



**కామారెడ్డి జిల్లా ప్రతి నిధి:సెప్టెంబర్ 19.(పోరు తెలంగాణ న్యూస్:) :** కామారెడ్డి జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయం ముందు గల డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పాలభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా మాదిగ రాజకీయ పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆర్. బాగయ్య జిల్లా అధ్యక్షులు చిట్యాల సాయన్న మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పైన అనుచిత వైఖ్యాలు చేసిన అమర ప్రసాద్ ను పోలీసులు పట్టుకొని జైల్లో పెట్టినందుకు మాదిగ రాజకీయ పోరాట సమితి ఎమ్మార్పీఎస్ అంబేద్కర్ యువజన సంఘం పక్షాన రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టుకు ప్రత్యేక నమస్కారాలు తెలియజేస్తున్నామన్నారు. అమరా ప్రసాద్ పైన దేశద్రోహం కేసు పెట్టి జైలు నుండి బయటకు రాకుండా చేయాలని డిమాండ్ చేశారు. ఇంకొకసారి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పైన అనుచిత వ్యాఖ్యలు చేస్తే భౌతిక దాడులకు పాల్పడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ముస్తాపూర్ గ్రామ అంబేద్కర్ యువజన సంఘం సెక్రెటరీ బిట్ల రాజు, అంబేద్కర్ సంఘం జిల్లా కన్వీనర్ పి.శివరాజు, స్వర్ణలత,రజిత పాల్గొన్నారు.

# ఉరి వేసుకుని వ్యక్తి మృతి



**పోరు తెలంగాణ న్యూస్// మంచిర్యాల //లక్షెట్టిపేట :** మంచిర్యాల జిల్లా లక్షట్టిపేట పట్టణంలోని భగత్ సింగ్ నగర్ కు చెందిన గుర్రాల జయకర్ అనే 40 సంవత్సరాల వ్యక్తి ఇంటి సమీపంలోని వేప చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుని మృతి చెందాడు. మృతునికి భార్య ముగ్గురు పిల్లలు ఉన్నారు. అందరికీ పెళ్లి లయ్యాయి. మృతునికి కుటుంబ కలహాలతో నిన్న గొడవలు జరగగా మృతుడు తన సోదరులకు ఫోన్ చేసి నాకు ఇంట్లో కుటుంబ కలహాలతో ఎప్పుడు గొడవ జరుగుతుంది నాకు బతకడం ఇష్టం లేదు అని ఫోన్ చేసి చెప్పి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి సోదరుడు గుర్రాల చంద్రమౌళి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేయడం జరుగుతుందనీ ఎస్సై గోపతి సురేష్ ఒక ప్రకటనలో తెలియజేశారు

## మండల కాంగ్రెస్ సభ్యులను అభినందనలు తెలిపిన గౌడ సంఘ సభ్యులు



**పోరు తెలంగాణ ప్రతినిధి (భూమేశ్వర్)** : బాల్కొండ మండలం కేంద్రంలో నూతనంగా అధికార కాంగ్రెస్ పార్టీలో పదవులు పొందిన జిల్లా ఉపాధ్యక్షులు చాట్ల నరేష్,జిల్లా జనరల్ సెక్రెటరీ యునుస్,జిల్లా సెక్రటరీ సంజీవ్ గౌడ్,బాల్కొండ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కుందరం శ్రీనివాస్, ఉపాధ్యక్షులు గడ్డం రవి లను బాల్కొండ పట్టణ గౌడ సంగం నేతృత్వంలో గౌడ సభ్యులు పడాల సత్యనారాయణ గౌడ్, అంజాగౌడ్,రమేష్ గౌడ్, సైదగర్ శ్రీనివాస్ గౌడ్,సాయగౌడ్ లు నూతనంగా ఎంపికైన అధికార కాంగ్రెస్ పార్టీ నేతలను ఘనంగా శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు.కాంగ్రెస్ పార్టీ బలోపేతం చేసేందుకు కృషి చేస్తామని ప్రజల కోసం సేవలో ముశీదుటామని వారు ఈ కార్యక్రమంలో అన్నారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతం చేయాలి

జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు





**పోరు తెలంగాణ,సెప్టెంబర్ 19, 2026** : ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు అన్నారు. శనివారం జిల్లాలోని హాజీపూర్ మండల తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ విచారణలు పూర్తైన కేసులకు సంబంధించిన డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేసి, నిర్ణీత గడువులోగా ఎస్ఐఆర్ ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఎస్ఐఆర్ ప్రక్రియను సకాలంలో పూర్తి చేసేందుకు అవసరమైతే సెలవు రోజుల్లోనూ కార్యాలయ సిబ్బంది విధులు నిర్వహించాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న పనులను ప్రాధాన్యతా క్రమంలో పూర్తి చేసి, ప్రక్రియలో ఎలాంటి జాప్యం లేకుండా చర్యలు చేపట్టాలని తెలిపారు. అనంతరం హాజీపూర్ తహసీల్దార్‌తో కలిసి ముల్కల్ల గ్రామపంచాయతీ పరిధిలోని కొత్తపల్లి హామ్లెట్ సందర్శించి రీ-సర్వే ప్రక్రియ ప్రారంభంలో భాగంగా చేపడుతున్న గ్రామ సరిహద్దుల నిర్ధారణ పనులను పరిశీలించారు. గ్రామ సరిహద్దుల నిర్ధారణ, రీ-సర్వేకు సంబంధించిన పనులను నిబంధనల ప్రకారం సమన్వయంతో చేపట్టి, ప్రక్రియను సక్రమంగా ముందుకు తీసుకెళ్లాలని అధికారులకు సూచించారు ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



**పోరు తెలంగాణ ఓదెల ప్రతినిధి రవీంద్ర చారి** : ఓదెల మండలం గూడెం గ్రామానికి చెందిన చిట్ల మల్లేష్, కాల్వశ్రీరాంపూర్ మండలం జగ్గయ్యపల్లి గ్రామానికి చెందిన ఇజ్జిగిరి సమ్మయ్య అనారోగ్యంతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వారి వైద్య ఖర్చుల కోసం ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన ఎల్ఓసీ చెక్కులను శనివారం అసెంబ్లీ విప్ ఛాంబర్‌లో ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. మల్లేష్‌కు రూ.2.50 లక్షలు, సమ్మయ్యకు రూ.75 వేల విలువైన చెక్కులను అందించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే తెలిపారు.

## ఆశ్రమ పాఠశాలల్లో సౌకర్యాలు పరిశీలించిన డిప్యూటీ డైరెక్టర్

విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసిన జాదవ్ అంబాజీ....



**పోరు తెలంగాణ సెప్టెంబర్ 19: కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి** : కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండలంలోని పానాపటార్, మార్లావాయి, కోహినూర్ ఆశ్రమ పాఠశాలలను గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ జాదవ్ అంబాజీ శనివారం సందర్శించారు. విద్యార్థుల వసతి గదులు, భోజన ఏర్పాట్లు, పరిసరాల పరిశుభ్రతను పరిశీలించి, పానాపటార్ ఆశ్రమ పాఠశాల ఆవరణలో పెరిగిన పిచ్చిమొక్కలను తొలగించారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. విద్యార్థులతో వారి చదువు, ఆరోగ్యం, తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్ల సౌకర్యాలపై వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థులు తమ సమస్యలను డిప్యూటీ డైరెక్టర్ దృష్టికి తీసుకురాగా, విద్యాభివృద్ధికి అవసరమైన సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. క్రమశిక్షణతో చదివి ఉన్నత లక్ష్యాలు సాధించాలని విద్యార్థులకు సూచించారు.

## అనుమతి లేకుండా విధులకు గైర్హాజరైతే చర్యలు

వైద్య కళాశాలలో ఆకస్మిక తనిఖీ చేసిన కలెక్టర్ హరిత....




**పోరు తెలంగాణ సెప్టెంబర్ 19: కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి** : కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రభుత్వ ఉద్యోగులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, అనుమతి లేకుండా విధులకు గైర్హాజరైన వారిపై చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ కె.హరిత స్పష్టం చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో ఆకస్మిక తనిఖీ నిర్వహించి సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించారు. అనుమతి లేకుండా గైర్హాజరైన అసిస్టెంట్ ప్రొఫెసర్లపై చర్యలు తీసుకోవాలని డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ అధికారులకు ఫోన్‌లో ఆదేశించారు. సమయపాలన పాటించని, తరచూ గైర్హాజరయ్యే ఉద్యోగులను ఉపేక్షించేది లేదని కలెక్టర్ హెచ్చరించారు.

# ప్రజల చెంతకే ఉచిత న్యాయ సేవలు

బాల్కొండ గ్రామ పంచాయతీలో లీగల్ ఎయిడ్ క్లినిక్ ప్రారంభం

ప్రతి శనివారం న్యాయ సలహాలు.. చట్టాలపై అవగాహన

ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని

సీనియర్ సివిల్ జడ్జి శ్రీదేవి వెల్లడి






**పోరు తెలంగాణ ప్రతినిధి (భూమేశ్వర్)** : న్యాయ సహాయం అవసరమైన పేదలు, నిరుపేదలు,అక్షరాస్యత లేని వారు,సామాన్య ప్రజలకు న్యాయసేవలను మరింత చేరువ చేసేందుకు బాల్కొండ గ్రామ పంచాయతీలో లీగల్ ఎయిడ్ క్లినిక్ ప్రారంభమైంది.ఆర్మూర్ లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్,సీనియర్ సివిల్ జడ్జి శ్రీదేవి శనివారం గ్రామపంచాయతీ కార్యాలయంలో క్లినిక్‌ను ప్రారంభించారు.ఇకపై ప్రతి శనివారం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్యానల్ అడ్వకేట్ కొండి పవన్‌కుమార్ క్లినిక్‌లో అందుబాటులో ఉండి ప్రజలకు న్యాయ సలహాలు,చట్టాలపై అవగాహన,అవసరమైన న్యాయ సహాయం అందించనున్నారని ఆమె అన్నారు.ఈ సందర్భంగా జడ్జి శ్రీదేవి మాట్లాడుతూ న్యాయసేవలు పొందేందుకు ఆర్థిక ఇబ్బందులు అడ్డంకిగా మారకూడదనే ఉద్దేశంతో లీగల్ ఎయిడ్ సేవలను ప్రజల చెంతకు తీసుకొస్తున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో చాలామందికి తమ హక్కులు,చట్టపరమైన రక్షణలు,అందుబాటులో ఉన్న న్యాయసేవలపై పూర్తి అవగాహన ఉండదన్నారు. ముఖ్యంగా పిల్లలపై లైంగిక దాడులు వంటి నేరాలకు సంబంధించి చట్టాల్లో కఠినమైన శిక్షలు ఉన్నప్పటికీ,వాటిపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.వివిధ చట్టాలపై గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం కూడా లీగల్ సర్వీసెస్ కమిటీ బాధ్యతల్లో భాగమని వివరించారు.న్యాయ సహాయం కోసం బాధితులు స్వయంగా కార్యాలయాలకు లేదా కోర్టులకు రాలేని పరిస్థితుల్లోనూ వారికి చేరువయ్యేందుకు లీగల్ సర్వీసెస్ సంస్థలు చర్యలు తీసుకుంటాయని సీనియర్ సివిల్ జడ్జి శ్రీదేవి తెలిపారు.అవసరమైన సందర్భాల్లో సంఘటన స్థలానికి వెళ్లి పరిస్థితిని పరిశీలించి,బాధితులకు అందుబాటులో ఉన్న న్యాయ సహాయాన్ని కల్పించే అవకాశం ఉందన్నారు.గతంలో కార్మికులకు సంబంధించిన సమస్యల్లోనూ లీగల్ సర్వీసెస్ సంస్థ జోక్యం చేసుకుని కేసుల నమోదుకు సహకరించిన సందర్భాలను ఆమె ప్రస్తావించారు.

**పెండింగ్ కేసులకు రాజీ మార్గం**

కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న రాజీకి అవకాశం ఉన్న కేసులను లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకునే అవకాశం ఉందని జడ్జి శ్రీదేవి తెలిపారు. వివాహ సంబంధ,సివిల్,నగదు రికవరీ తదితర కేసుల్లో ఇరుపక్షాలు అంగీకరిస్తే లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో నిర్వహించే లోక్ అదాలత్ ద్వారా పరిష్కారం పొందవచ్చన్నారు.దీంతో కేసుల పరిష్కారంలో సమయం, ఖర్చు తగ్గించుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. పెండింగ్ కేసులున్న వారు రాజీకి అవకాశం ఉన్న అంశాలను పరిశీలించుకుని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ప్రజలకు న్యాయసేవలు అందించడంతో పాటు చట్టాలను గౌరవించేలా అవగాహన కల్పించడమే లీగల్ సర్వీసెస్ వ్యవస్థ ప్రధాన ఉద్దేశమని ఆమె వివరించారు.న్యాయపరమైన సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా అందుబాటులో ఉన్న ఉచిత న్యాయసేవలను వినియోగించుకోవాలని కోరారు. న్యాయ సహాయం,చట్టాలపై అవగాహన, బాధితులకు అవసరమైన సహకారం వంటి సేవలను ప్రజల వద్దకు తీసుకెళ్లేందుకు లీగల్ సర్వీసెస్ కమిటీ కృషి చేస్తోందన్నారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ గాండ్ల రాజేష్,ప్యానల్ అడ్వకేట్ కొండి పవన్ కుమార్,ఎస్సై శైలేందర్,ఉప సర్పంచ్ గాండ్ల రాజేందర్, పంచాయతీ కార్యదర్శి మోహన్, వార్డు సభ్యులు,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ఆక్రమించిన భూములను భూమిలేని పేదలకు పంపిణీ చేయాలి

బిజెపి మండల అధ్యక్షులు కారెంగుల శ్రీనివాస్



**పోరు తెలంగాణ ఓదెల ప్రతినిధి రవీంద్ర చారి** : తెలంగాణలో భూకబ్జాలు, ధరణి, 22ఏ జాబితా, ఫాంహౌస్‌ల వ్యవహారాలపై కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు పరస్పరం ఆరోపణలు చేసుకుంటూ రాజకీయాలు చేయడం మానుకోవాలని బీజేపీ మండల అధ్యక్షుడు కారెంగుల శ్రీనివాస్ అన్నారు. భూవివాదాల కారణంగా సామాన్య రైతులు, పేదలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో ధరణి పోర్టల్‌లో పార్ట్--బి, 22ఏ కేటగిరీల్లో భూముల నమోదుతో అనేక మంది రైతులు తమ భూములపై హక్కులు వినియోగించుకోలేని పరిస్థితి ఏర్పడిందని ఆరోపించారు. ప్రస్తుత ప్రభుత్వం విచారణలు, సిట్‌ల పేరుతో కాలయాపన చేయకుండా బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. మూసీ పరివాహక ప్రాంతంలోని ఫార్మ్‌హౌస్‌లు, విల్లాలు, ప్రభుత్వ భూముల ఆక్రమణలపై సమగ్ర విచారణ జరిపించాలని కోరారు. ధరణి అక్రమాలు, ప్రభుత్వ--అసైన్డ్ భూముల ఆక్రమణలపై సిట్టింగ్ హైకోర్టు న్యాయమూర్తితో న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. 22ఏ జాబితాలోని భూముల వివరాలను ప్రజలకు అందుబాటులో ఉంచాలని, అక్రమంగా ఆక్రమించిన భూములను స్వాధీనం చేసుకుని భూమిలేని పేదలకు పంపిణీ చేయాలని కోరారు. పేదలకు ఒక న్యాయం, పెద్దలకు మరో న్యాయం ఉండకూడదని శ్రీనివాస్ స్పష్టం చేశారు.

## చీలపల్లి ప్రజల సమస్యలకు పరిష్కారం

వారం రోజుల్లో వాగులపై కల్వర్టుల పనులు ప్రారంభం.....

ఎమ్మెల్సీ దండే విఠల్.....



**పోరు తెలంగాణ సెప్టెంబర్ 19: కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి** : కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్(టి) మండలం చీలపల్లి గ్రామ ప్రజలు వర్షాకాలంలో ఎదుర్కొంటున్న రాకపోకల సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్ తెలిపారు. చీలపల్లి మార్గంలోని రెండు వాగులపై కల్వర్టుల నిర్మాణానికి కలెక్టర్ నిధులు మంజూరు చేశారని పేర్కొన్నారు. వంతెన నిర్మాణం చేపట్టాలని ప్రజలు కోరగా, అటవీ శాఖ అనుమతుల కారణంగా కొంత సమయం పట్టే అవకాశం ఉందని, అప్పటివరకు ఇబ్బందులు తగ్గించేందుకు వారం రోజుల్లో రెండు వాగులపై కల్వర్టుల పనులు ప్రారంభిస్తామని ఎమ్మెల్సీ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో చీలపల్లి సర్పంచ్, ప్రజా ప్రతినిధులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ స్టేషన్లను సందర్శించిన డీఐజీ అంబర్ కిషోర్ ఝా

నేరాల నియంత్రణ, మహిళల భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశం.....



**పోరు తెలంగాణ సెప్టెంబర్ 19: కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి** : కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కాళేశ్వరం జోన్-1 డీఐజీ అంబర్ కిషోర్ ఝా శనివారం ఆసిఫాబాద్ పట్టణ పోలీస్ స్టేషన్, వాంకిడి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయాన్ని సందర్శించారు. వివిధ విభాగాలు, రికార్డులు, కేసుల దర్యాప్తు పురోగతిని పరిశీలించారు. జిల్లా ఎస్పీ నితికా పంత్ పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. పోలీస్ అధికారులతో కలిసి సర్కిల్ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, స్వాధీనం చేసుకున్న వాహనాలను క్రమబద్ధంగా భద్రపరచి వివరాలు నమోదు చేయాలని ఆదేశించారు. 5ఎస్ విధానం అమలుతో పాటు రికార్డులు, ఫైళ్లను క్రమబద్ధంగా నిర్వహించాలని సూచించారు. తీవ్రమైన నేరాల కేసులు, పెండింగ్ కేసుల ఫైళ్లను పరిశీలించి, దర్యాప్తు పురోగతి, నిందితుల అరెస్టులు, పెండింగ్‌కు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. పోలీస్ సిబ్బంది కిట్‌ను పరిశీలించి వారి శాఖాపరమైన సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కేసుల దర్యాప్తులో నాణ్యత, వేగం ఉండాలని, ఆధారాలను పూర్తిగా సేకరించాలని సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణలో అప్రమత్తంగా ఉండాలని, మహిళలు, బాలికల భద్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని డీఐజీ అంబర్ కిషోర్ ఝా సూచించారు. ప్రజలతో సత్సంబంధాలు కొనసాగిస్తూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని పోలీస్ అధికారులకు సూచించారు.

## భీమారం మండల ఎస్టీల మోర్చా అధ్యక్షుడిగా ధరావత్ రామ్ నాయక్.



**పోరు తెలంగాణ మంచిర్యాల, సెప్టెంబర్ 19** : భీమారం మండల ఎస్టీ మోర్చా అధ్యక్షుడిగా బూరుగుపల్లి గ్రామానికి చెందిన ధరావత్ రామ్ నాయక్ ను నియమించారు. మంచిర్యాల జిల్లా ఎస్పీ మోర్చా అధ్యక్షుడు ఆడే ప్రేమ్ సింగ్, బీజేపీ మంచిర్యాల అధ్యక్షులు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్ బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రఘునాథ్ వెర్రబెల్లి చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించినందుకు గాను న్యా,ం, సామాజిక వర్గంలోని సమస్యలకోసం,అలాగే పార్టీ బలోపేతం కోసం పోరాడతానని,ఈ అవకాశం రావడానికి సహకరించిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

## ఎంప్లాయిస్ యూనియన్ ద్వారానే ఆర్టీసీ కార్మికుల హక్కులు సాధ్యం

బోగే ఉపేందర్.....

ఎన్నికల్లో బస్ గుర్తుకు ఓటు వేయాలని పిలుపు.....



**పోరు తెలంగాణ సెప్టెంబర్ 19: కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి** : కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ఆర్టీసీ కార్మికుల హక్కులు ఎంప్లాయిస్ యూనియన్ (ఏఐటియుసి) ద్వారానే సాధ్యమని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ పేర్కొన్నారు. శనివారం ఆసిఫాబాద్ డిపోలో ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో గేట్ మీటింగ్ నిర్వహించారు. గత పాలకుల నిర్లక్ష్యం వల్ల ఆర్టీసీ నష్టాల్లోకి వెళ్లిందని, విలీనం చేస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం మూడేళ్లలో కార్మికులను మోసం చేసిందని, బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం, ఉద్యోగ భద్రత కల్పించడం, అధికారుల వేధింపులు తగ్గించడం, పెండింగ్‌లో ఉన్న పీఆర్సీ, సీసీఎస్ బకాయిలు ఇప్పించడం వంటి డిమాండ్లను ప్రస్తావించారు. 2017, 2021 పీఆర్సీ బకాయిలు, 2025 వేతన సవరణ, గ్యారేజీ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఎన్నికల్లో బస్ గుర్తుకు ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని కార్మికులను కోరారు.

## వంజిరిలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ



**పోరు తెలంగాణ సెప్టెంబర్ 19: కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి** : కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ మండలంలోని వంజిరి గ్రామపంచాయతీ పరిధిలో అర్హులైన రేషన్ లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కొత్త స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కొత్త స్మార్ట్ రేషన్ కార్డులు పీవీసీ రూపంలో ఉండటంతో పాటు క్యూఆర్ కోడ్ వంటి ఆధునిక సదుపాయాలను కలిగి ఉంటాయని ప్రభుత్వం తెలిపింది. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 1.05 కోట్ల కుటుంబాలకు స్మార్ట్ రేషన్ కార్డులను అందించే కార్యక్రమాన్ని ఆగస్టు 15న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. వంజిరిలో జరిగిన కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ లక్ష్మి, ఉపసర్పంచ్ భరత్, రేషన్ డీలర్ లీలా, గ్రామస్థులు, రేషన్ లబ్ధిదారులు పాల్గొన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వం అందిస్తున్న రేషన్ సౌకర్యాలు సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా పలువురు కోరారు.

## మంచిర్యాల బస్టాండ్ పునరుద్ధరణకు చర్యలు



**పోరు తెలంగాణ మంచిర్యాల సెప్టెంబర్ 19** : మంచిర్యాల పట్టణ ప్రజలు, ప్రయాణికుల సౌకర్యాలను దృష్టిలో పెట్టుకుని మంచిర్యాల బస్టాండ్ పునరుద్ధరణ పనులపై మంచిర్యాల శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు సంబంధిత అధికారులతో కలిసి బస్టాండ్‌ను పరిశీలించారు. బస్టాండ్‌లో ప్రయాణికులకు అవసరమైన మౌలిక వసతులు, సౌకర్యాలు, పునరుద్ధరణ పనులపై అధికారులతో చర్చించి, ప్రజలకు మెరుగైన సేవలు అందేలా అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు.. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు మాట్లాడుతూ మంచిర్యాల లో దాదాపు 20 కోట్ల రూపాయలతో ఆధునీకరణ బస్టాండ్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ ఈడీ రాజశేఖర్ , మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అన్వేష్, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధర్ని మధుకర్, డిప్యూటీ మేయర్ సల్ల రమ్య-మహేష్, కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, కార్పొరేటర్ తూముల నరేష్, మంచిర్యాల మార్కెట్ కమిటీ చైర్మన్ రామగిరి బానేష్, మున్సిపల్ అధికారులు, కార్పొరేటర్లు, నాయకులు, మహిళా నాయకురాలు, యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు..

# జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాల్కొండలో

# పేరెంట్-టీచర్స్ అసోసియేషన్ సమావేశం



**పోరు తెలంగాణ ప్రతినిధి (భూమేశ్వర్) :** జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాల్కొండలో నిర్వహించిన పేరెంట్--టీచర్స్ అసోసియేషన్ సమావేశం విజయవంతంగా నిర్వహించారు. ఈ సమావేశంలో పాఠశాల అమ్మ ఆదర్శ పాఠశాల చైర్‌పర్సన్ శ్రీమతి లత,ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు మరియు పెద్ద సంఖ్యలో విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు బట్టు రాజేశ్వర్ మాట్లాడుతూ విద్యార్థుల విద్యా ప్రగతి, క్రమశిక్షణ,హాజరు, పదవ తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక శిక్షణ తరగతులు తదితర అంశాలపై తల్లిదండ్రులతో చర్చించారు. పాఠశాల అభివృద్ధిలో తల్లిదండ్రుల సమాజ భాగస్వామ్యం ఎంతో అవసరమని అన్నారు. పాఠశాలలో విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి అవసరమైన అనేక ఆధునిక విద్యా సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అటల్ టింకరింగ్ ల్యాబ్,డిజిటల్ క్లాసులు, యోగా, కరాటే, రోబోటిక్స్ శిక్షణ, స్కాలర్‌షిప్ ప్రత్యేక శిక్షణ, ల్యాబ్, కంప్యూటర్ విద్య,స్పోకెన్ ఇంగ్లీష్, విజ్ఞాన విహారయాత్రలు,కృత్యాధార బోధనా విధానం వంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థులకు విభిన్నమైన అభ్యసన అవకాశాలు కల్పిస్తున్నామని వివరించారు. తల్లిదండ్రులు తమ పిల్లల చదువుపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ,ఇంటివద్ద కూడా బాధ్యతాయుతంగా చదివేలా ప్రోత్సహించాలని,పాఠశాల ఉపాధ్యాయులతో నిరంతరం సమన్వయం చేసుకోవాలని ప్రధానోపాధ్యాయులు బట్టు రాజేశ్వర్ సూచించారు. విద్యార్థుల ప్రతిభను వెలికితీసేందుకు పాఠశాల--తల్లిదండ్రుల సమన్వయం మరింత బలోపేతం కావాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు ఎం.ప్రశాంత్ కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# అధికారుల డుమ్మా, సమస్యలకు పరిష్కారం కరవు

గందరగోళంగా మండల
పరిషత్ సమీక్ష సమావేశం.....
ప్రజా సమస్యలపై సభ్యుల నిలదీత..
సమాధానాల్లో స్పష్టత కరవు....
సమావేశానికి రాని అధికారులు.. కింది స్థాయి
సిబ్బందితోనే సరిపెట్టుకున్న వైనం.....
సింగిల్ విండో చైర్మన్ జాబొరే పెంటు ధ్వజం....





**పోరు తెలంగాణ సెప్టెంబర్ 19: కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి :** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండల పరిధిలోని గ్రామాల్లో నెలకొన్న ప్రజా సమస్యలు, అభివృద్ధి పనులు, విద్యుత్, వైద్యం, వ్యవసాయం, పారిశుద్ధ్యం తదితర అంశాలపై సమగ్రంగా చర్చించి పరిష్కార మార్గాలు చూపాల్సిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఆశించిన స్థాయిలో సాగలేదనే అసంతృప్తి సభ్యుల్లో వ్యక్తమైంది. కీలక శాఖలకు చెందిన బాధ్యత కలిగిన అధికారులు సమావేశానికి స్వయంగా హాజరు కాకపోవడం, వారి స్థానంలో కింది స్థాయి సిబ్బందిని పంపించడంతో ప్రజాప్రతినిధులు పలు సమస్యలపై నిలదీశారు. సమావేశంలో ప్రస్తావించిన అనేక సమస్యలకు సంబంధించి స్పష్టమైన సమాధానాలు, పరిష్కారానికి నిర్దిష్ట గడువు తెలియకపోవడంతో సభ్యులు అసహనం వ్యక్తం చేశారు. గ్రామస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎన్నిసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం కాకపోవడంతో మండల సమావేశాల్లో ప్రస్తావిస్తున్నామని, ఇక్కడ కూడా స్పష్టత రాకపోతే సమస్యలను ఎవరికి చెప్పుకోవాలని పలువురు ప్రజాప్రతినిధులు ప్రశ్నించారు.

**సమావేశ సమాచారంలోనూ జాప్యం**

ప్రజా సమస్యలపై జరిగే మండల పరిషత్ సమావేశానికి సంబంధించిన సమాచారాన్ని కొంతమంది పాత్రికేయులకు ఆలస్యంగా తెలియజేయడంపై కూడా చర్చ జరిగింది. సమావేశాలు ప్రజలకు, ప్రజాప్రతినిధులకు, మీడియాకు పారదర్శకంగా అందుబాటులో ఉండేలా ముందస్తు సమాచారం ఇవ్వాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడ్డారు. సమావేశం ప్రారంభమయ్యే సమయానికి సమాచారం అందడం లేదా ఆలస్యంగా తెలియజేయడం వల్ల సమావేశ కార్యకలాపాలను పూర్తిస్థాయిలో కవర్ చేయడంలో ఇబ్బందులు ఏర్పడుతున్నాయని పాత్రికేయ వర్గాలు పేర్కొన్నాయి. మండల పరిషత్ సమావేశాల సమాచారం విషయంలో ఎలాంటి జాప్యం, వివక్షకు తావులేకుండా సంబంధిత అధికారులు సమన్వయంతో వ్యవహరించాలని కోరుతున్నారు. అధికారుల గైర్హాజరుపై సభ్యుల నిలదీత సమావేశంలో ప్రధానంగా అధికారుల గైర్హాజరు అంశమే చర్చకు వచ్చింది. ప్రజల సమస్యలకు నేరుగా సమాధానం చెప్పాల్సిన అధికారులు హాజరు కాకపోవడం వల్ల కింది స్థాయి సిబ్బంది ఇచ్చే సమాధానాలతో సభ్యులు సంతృప్తి చెందలేకపోయారు. తమ శాఖ పరిధిలోని సమస్యలపై పూర్తి సమాచారం, నిధుల పరిస్థితి, పనుల పురోగతి, పరిష్కారానికి తీసుకోబోయే చర్యలు వంటి విషయాలపై సంబంధిత అధికారులు మాత్రమే స్పష్టత ఇవ్వగలరని సభ్యులు పేర్కొన్నారు. కేవలం సిబ్బందిని పంపించి సమావేశాన్ని ముగించే విధానం వల్ల ప్రజా సమస్యలకు పరిష్కారం లభించదని అన్నారు.

**గత సమావేశంలో చెప్పినా.. చర్యలు ఎక్కడ?**

విద్యుత్ శాఖకు సంబంధించి సభ్యులు తీవ్రంగా ప్రశ్నించారు. గ్రామాల్లో ప్రమాదకరంగా ఉన్న ఇనుప విద్యుత్ స్తంభాలను తొలగించాలని సుమారు 45 రోజుల క్రితమే జరిగిన సమావేశంలో సూచించినప్పటికీ ఇప్పటివరకు చర్యలు తీసుకోలేదని తెలిపారు. ప్రమాదకరంగా మారిన స్తంభాల వద్ద ఎప్పుడైనా ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరిదని ప్రశ్నించారు. ప్రజల భద్రతకు సంబంధించిన అంశాలను కూడా అధికారులు నిర్లక్ష్యం చేయడం సరికాదని అన్నారు. సమస్యను గుర్తించిన వెంటనే సంబంధిత శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

**రైతు సమస్యలపై విస్తృత చర్చ**

వ్యవసాయ రంగానికి సంబంధించి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు సమావేశంలో ప్రస్తావనకు వచ్చాయి. ముఖ్యంగా యూరియా కొరత కారణంగా రైతులు ఇబ్బందులు పడుతున్నారని సభ్యులు తెలిపారు. పంటలకు అవసరమైన సమయంలో ఎరువులు అందుబాటులో లేకపోవడం వల్ల రైతులు ప్రైవేటు మార్కెట్‌పై ఆధారపడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు అవసరమైన యూరియా, ఇతర ఎరువుల నిల్వలు, సరఫరా విధానం, పంపిణీపై అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని కోరారు. రైతులు గంటల తరబడి తిరిగే పరిస్థితి లేకుండా గ్రామాల వారీగా అవసరాలను గుర్తించి సరఫరా చేయాలని సూచించారు.

**అడవి పందుల బెడదపై శాశ్వత చర్యలు**

పంట పొలాల్లోకి అడవి పందులు ప్రవేశించి పంటలను ధ్వంసం చేస్తున్నాయని పలువురు సభ్యులు తెలిపారు. విత్తనాలు, ఎరువులు, కూలీల ఖర్చు పెట్టి సాగు చేసిన పంట చేతికొచ్చే సమయంలో అడవి పందుల కారణంగా నష్టం వాటిల్లుతోందని సింగిల్ విండో చైర్మన్ జాబొరే పెంటు అన్నారు. రైతులు పంటలను రక్షించుకునే క్రమంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఈ సమస్యను కేవలం రైతుల సమస్యగా కాకుండా సంబంధిత శాఖలు సమన్వయంతో పరిష్కరించాల్సిన అంశంగా చూడాలని కోరారు. అడవి పందుల నివారణకు శాస్త్రీయ పద్ధతులను పరిశీలించాలని, పంట పొలాల రక్షణకు అవసరమైన సాంకేతిక పరిష్కారాలపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. పంట నష్టంపై ప్రభుత్వ నిబంధనల ప్రకారం పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

**వైద్య సేవలపై సభ్యుల అసంతృప్తి**

గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో ప్రభుత్వ వైద్య సేవలు మరింత బలోపేతం కావాలని సభ్యులు కోరారు. జ్వరాలు, సీజనల్ వ్యాధులు ప్రబలే సమయంలో గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యులు, సిబ్బంది, మందులు, పరీక్షా సదుపాయాలు అందుబాటులో ఉండాలని కోరారు. అత్యవసర పరిస్థితుల్లో రోగులను ఇతర ప్రాంతాలకు తరలించాల్సిన పరిస్థితులు తగ్గేలా స్థానికంగా అందుబాటులో ఉన్న వైద్య సదుపాయాలను బలోపేతం చేయాలని సూచించారు. ప్రభుత్వ వైద్య వ్యవస్థపై ప్రజలకు నమ్మకం పెరిగేలా అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని సభ్యులు కోరారు.

**గ్రామాల అభివృద్ధిపై సర్పంచుల ఆవేదన**

గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు అవసరమైన వనరులు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పలువురు సర్పంచులు తెలిపారు. పారిశుద్ధ్య నిర్వహణ, చెత్త సేకరణ, రహదారుల సంరక్షణ, కాలువల శుభ్రత తదితర పనులకు అవసరమైన వాహనాలు, పరికరాలు అందుబాటులో లేకపోవడంతో ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్నాయని అన్నారు. గ్రామాల్లో సమస్యలను గుర్తించినా వాటి పరిష్కారానికి అవసరమైన నిధులు, వనరులు లేకపోతే ప్రజలకు సమాధానం చెప్పడం కష్టంగా మారుతోందని తెలిపారు. మండల, జిల్లా స్థాయి అధికారులు గ్రామపంచాయతీలకు అవసరమైన సహకారం అందించాలని కోరారు.

**సమీక్ష సమావేశాలు కేవలం తంతుగా మారకూడదు**

మండల పరిషత్ సర్వసభ్య సమావేశాలు కేవలం హాజరు, చర్చలు, తీర్మానాలకే పరిమితం కాకుండా ప్రజా సమస్యలకు పరిష్కారం చూపించే వేదికలుగా ఉండాలని సభ్యులు పేర్కొన్నారు. గత సమావేశాల్లో ప్రస్తావించిన సమస్యలపై ఏం చర్యలు తీసుకున్నారు? ఏ పనులు పూర్తయ్యాయి? ఏవి పెండింగ్‌లో ఉన్నాయి? వాటి కారణాలు ఏమిటి? తదుపరి చర్యలు ఏమిటి? అనే వివరాలను ప్రతి శాఖ అధికారి సమర్పించే విధానం ఉండాలని సూచించారు. సమస్యలను నమోదు చేసి వదిలేయకుండా ప్రతి అంశానికి బాధ్యత కలిగిన అధికారిని గుర్తించి, పరిష్కారానికి గడువు నిర్ణయించాలని డిమాండ్ చేశారు.

**కలెక్టర్ జోక్యం చేసుకోవాలి**

ప్రజా సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం చేస్తున్న అధికారుల వ్యవహారశైలిపై జిల్లా ఉన్నతాధికారులు దృష్టి సారించాలని సింగిల్ విండో చైర్మన్ జాబొరే పెంటు కోరారు. ప్రజల సమస్యలు వినేందుకు, ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసేందుకు సిద్ధంగా లేని అధికారులపై జిల్లా కలెక్టర్ చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. మండల స్థాయి సమావేశానికి అధికారులు హాజరు కాకపోవడం సాధారణ విషయంగా మారకూడదని, సంబంధిత శాఖల బాధ్యత కలిగిన అధికారులు తప్పనిసరిగా హాజరై తమ శాఖకు సంబంధించిన అంశాలపై సమాధానం చెప్పే విధానం ఉండాలని అన్నారు.

**ప్రజల సమస్యలే ప్రాధాన్యం**

మండల పరిధిలోని ప్రతి గ్రామంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి పరిష్కరించడమే మండల పరిషత్ సమావేశాల ప్రధాన ఉద్దేశమని సభ్యులు పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు గ్రామాల నుంచి తీసుకువచ్చే సమస్యలను అధికారులు ప్రాధాన్యంతో పరిగణించి క్షేత్రస్థాయిలో పరిశీలించాలని కోరారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసినప్పుడే గ్రామాల్లో అభివృద్ధి పనులు వేగవంతమవుతాయని అన్నారు. సమావేశాలకు అధికారులు హాజరై సమస్యలకు సమాధానాలు ఇవ్వడంతో పాటు, సమావేశం అనంతరం కూడా వాటి పరిష్కారంపై పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో జాప్యం, నిర్లక్ష్యానికి తావులేకుండా మండల స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, లేనిపక్షంలో ప్రజల్లో ప్రభుత్వ యంత్రాంగంపై నమ్మకం దెబ్బతినే అవకాశం ఉందని సభ్యులు పేర్కొన్నారు.

# కలెక్టర్ చొరవతో వృద్ధుడికి కుటుంబ ఆసరా

తండ్రిని ఇంటికి తీసుకెళ్లిన కుమారుడు.....



**పోరు తెలంగాణ సెప్టెంబర్ 19: కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి :** కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ మండలం బోడేపల్లి గ్రామానికి చెందిన మల్లయ్య అనే వృద్ధుడు కుమారుడు తనను పట్టించుకోవడం లేదని ఆవేదనతో ఈ నెల 18న జిల్లా కలెక్టరేట్‌కు వచ్చారు. విషయం తెలుసుకున్న జిల్లా కలెక్టర్ కె.హరిత వెంటనే స్పందించి, వృద్ధుడి వద్దకు స్వయంగా వెళ్లి పరిస్థితిని తెలుసుకున్నారు. తక్షణమే రక్షణ, వసతి కల్పించేలా అధికారులను ఆదేశించారు. విషయం తెలుసుకున్న కుమారుడు స్పందించి, తండ్రి బాధ్యతను పూర్తిగా స్వీకరిస్తానని హామీ ఇచ్చారు. కలెక్టర్ కుమారుడితో మాట్లాడి కుటుంబ బాధ్యతలను వివరించగా, తండ్రిని ప్రేమగా చూసుకుంటానని తెలిపి ఇంటికి తీసుకువెళ్లారు. తన సమస్య పరిష్కారమైనందుకు వృద్ధుడు సంతోషం వ్యక్తం చేశారు. వృద్ధాప్యంలో కుటుంబ సభ్యుల ఆదరణ, భద్రత అవసరమని, వృద్ధుల పట్ల మానవతా దృక్పథంతో వ్యవహరించాలని కలెక్టర్ కె.హరిత సూచించారు.

# బాలల రక్షణలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి సునీత కుంచాల





**పోరు తెలంగాణ,పెద్దపల్లి, సెప్టెంబర్ 19 :** పెద్దపల్లి సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలో మిషన్ బాల సురక్ష – శిక్షా, న్యాయ 2026లో భాగంగా చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్లు గా నామినేట్ చేసిన ఉపాధ్యాయులకు పిల్లల హక్కుల పై వన్ డే సెన్సిటైజేషన్ కార్యక్రమాన్ని ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి సునీత కుంచాల, అదనపు జిల్లా సెషన్స్ జడ్జి ( పోక్సో)కె.స్వప్నరాణి, డీసీపీ రాంరెడ్డి తదితరులు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి సునీత కుంచాల మాట్లాడుతూ – – పాఠశాలల్లో విద్యార్థుల భద్రత , రక్షణతో పాటు వారి భవిష్యత్తు ను తీర్చిదిద్దేందుకు రాష్ట్ర న్యాయ సేవా అధికార సంస్థ, విద్యాశాఖ సంయుక్తంగా అవగాహన ఒప్పందం (మీూఖ) కుదుర్చుకున్నాయని తెలిపారు.

# అసలు మనకు నిద్ర ఎందుకు అవసరం..? రోజూ తగినన్ని గంటలపాటు నిద్రించకపోతే ఏమవుతుంది..?



నిద్ర అనేది మనషి శరీరానికి అత్యవసరం. సరైన మోతాదులో నీళ్లను తాగడం, వ్యాయామం చేయడం, పౌష్టికాహారం తీసుకోవడం ఎంత అవసరమో రోజూ తగినన్ని గంటల పాటు నిద్రించడం కూడా అంతే అవసరం. నిద్రించడం వల్ల మెదడు పునరుత్తేజం చెందుతుంది. మెదడు కణాలు మరమ్మత్తులకు గురవుతాయి. రోజంతా మనం చేసే పనులను జ్ఞాపకాల రూపంలో మెదడు భద్రపరుచుకునేందుకు నిద్ర ఉపయోగపడుతుంది. మన జ్ఞానం, తెలివితేటలు, నైపుణ్యాలను మెరుగు పరిచేందుకు మెదడుకు నిద్ర అవసరం అవుతుంది. నిద్ర వల్ల శరీరం కూడా తన భాగాలకు తాను మరమ్మత్తులు చేసుకుంటుంది. ముఖ్యంగా కణజాలాలు మరమ్మత్తులకు గురవుతాయి. కండరాలు, కణాలు నిర్మాణమవుతాయి. నిద్ర వల్ల శరీరం వ్యర్థాలను సులభంగా బయటకు పంపిస్తుంది. హార్మోన్లు సక్రమంగా పనిచేస్తాయి. రోగ నిరోధక వ్యవస్థ పటిష్టంగా మారుతుంది. ఇలా నిద్ర వల్ల మనకు ఎంతో మేలు జరుగుతుంది.

**అనేక సమస్యలు..**

అయితే రోజూ తగినన్ని గంటలపాటు కచ్చితంగా నిద్రించాల్సి ఉంటుంది. నిద్ర అనేది వ్యక్తిని, వయస్సును, వాతావరణ పరిస్థితులను బట్టి ఒక వ్యక్తి రోజుకు ఎన్ని గంటలపాటు నిద్రించాలి అనే సమయం మారుతుంది. సాధారణంగా రోజుకు 6 నుంచి 8 గంటల పాటు అయినా సరే నిద్రించాలని వైద్యులు చెబుతుంటారు. అయితే సరిగ్గా నిద్రించకపోతే అనేక దుష్పరిణామాలు ఎదురవుతాయి. మెదడు పనితీరు మందగిస్తుంది. చురుగ్గా ఉండలేకపోతారు.

# రక్తదానం చేయండి ప్రాణాలను కాపాడండి






**మంచిర్యాల, పోరు తెలంగాణ సెప్టెంబర్ 19 :** అక్టోబర్ 1వ తేదీని పురస్కరించుకొని జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవం సందర్భంగా మంచిర్యాల జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో జీజీహెచ్ ఆసుపత్రి నుంచి ఐబీ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని డీఎంహెచ్ఓ డాక్టర్ నరేందర్ రాథోడ్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ నరేందర్ రాథోడ్ మాట్లాడుతూ ఆరోగ్యవంతులు స్వచ్ఛందంగా రక్తదానం చేయాలని, రక్తదానం ద్వారా అవసరమైన వారికి ప్రాణరక్షణ కల్పించవచ్చని తెలిపారు. తలసేమియా వెల్ఫేర్ సొసైటీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాసర్ల శ్రీనివాస్ మాట్లాడుతూ మంచిర్యాల ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ బ్లడ్ బ్యాంక్ పరిధిలో సుమారు 800 మంది తలసేమియా, సికిల్ సెల్ పిల్లలకు ప్రతి 15 రోజులకు ఒకసారి రక్తం అవసరమవుతుందని తెలిపారు. స్వచ్ఛంద సంస్థలు, యువజన సంఘాలు, రాజకీయ పార్టీలు, కార్మిక సంఘాలు, సింగరేణి, పోలీస్, వైద్య ఆరోగ్య శాఖలు రక్తదాన శిబిరాలు నిర్వహించాలని కోరారు. తలసేమియా, సికిల్ సెల్ పిల్లలతో పాటు గర్భిణీలు, రోడ్డు ప్రమాద బాధితులు, అత్యవసర శస్త్రచికిత్సలు అవసరమైన వారికి రక్తం ఎంతో అవసరమని తెలిపారు. రక్తం కర్మాగారాల్లో తయారు కాదని, ఒక మనిషి ఇచ్చే రక్తం మరొక మనిషి ప్రాణాన్ని కాపాడుతుందని అన్నారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ అశోక్ ముంతా మాట్లాడుతూ ప్రతి ఆరోగ్యవంతుడు రక్తదానం చేయాలని, రక్తదానంపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ సుధాకర్ నాయక్, డాక్టర్ శ్రీధర్, డీఎంఓ వెంకటేశ్వర్లు, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా కార్యదర్శి చందూర్ మహేందర్, తలసేమియా వెల్ఫేర్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు సుంచు శంకరవర్మ, వైద్య ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మొలకలను ఇంట్లోనే ఇలా సులభంగా తయారు చేయండి వీటిని తినే విషయంలో ఈ జాగ్రత్తలు తప్పనిసరి..!



మన శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచేందుకు అనేక బలవర్ధకమైన ఆహారాలు అందుబాటులో ఉన్నాయి. వాటిల్లో మొలకలు కూడా ఒకటి. పెసలు, పల్లీలు, శనగలు తదితర గింజలను నీటిలో నానబెట్టి వాటితో మొలకలను తయారు చేస్తారు. మొలకలు చాలా బలవర్ధకమైన ఆహారంగా చెప్పవచ్చు. కానీ చాలా మంది వీటిని తినేందుకు అంతగా ఆసక్తిని చూపించరు. మొలకలు మనకు అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తాయి. మొలకలను చాలా మంది సాధారణంగా బయట కొంటుంటారు. కానీ కాస్త శ్రమిస్తే వీటిని ఇంట్లోనే మనం ఎంతో సులభంగా తయారు చేసుకోవచ్చు. మొలకలను తయారు చేసేందుకు పెద్దగా కష్టపడాల్సిన పనిలేదు. అన్ని రకాల గింజలను కొంత మోతాదులో తీసుకుని అన్నింటినీ కలిపి చాలా సులభంగా మొలకలను తయారు చేయవచ్చు.




## తెలుగు రాష్ట్రాల ప్రయాణికులకు గుడ్‌న్యూస్ దసరా పండగ కోసం ప్రత్యేక రైళ్లు..!




రాబోయే దసరా పండుగను పురస్కరించుకుని ప్రయాణికుల రద్దీని తగ్గించేందుకు దక్షిణ మధ్య రైల్వే ప్రత్యేక చర్యలు చేపట్టింది. తెలంగాణలోని చర్లపల్లి నుండి తమిళనాడులోని నాగర్‌కోయిల్ మధ్య ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు రైల్వే అధికారులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు..రాబోయే దసరా పండుగను పురస్కరించుకుని ప్రయాణికుల రద్దీని తగ్గించేందుకు దక్షిణ మధ్య రైల్వే ప్రత్యేక చర్యలు చేపట్టింది. తెలంగాణలోని చర్లపల్లి నుండి తమిళనాడులోని నాగర్‌కోయిల్ మధ్య ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు రైల్వే అధికారులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

రైళ్ల వివరాలు, సమయాలు:

రైలు నంబర్ 07535 (చర్లపల్లి నాగర్‌కోయిల్):

ఇది ప్రతి శుక్రవారం నడిచే తేదీలు: సెప్టెంబర్ 25, 2026 నుండి అక్టోబర్ 23, 2026 వరకు. అయితే ఈ రైలు మొత్తం 5 ట్రిప్పులు నడుస్తుంది.

రైలు నంబర్ 07536 (నాగర్‌కోయిల్ చర్లపల్లి):

ఇది ప్రతి ఆదివారం నడుస్తుంది. తేదీలు: సెప్టెంబర్ 27, 2026 నుండి అక్టోబర్ 25, 2026 వరకు నడుస్తుంది. అయితే మొత్తం 5 ట్రిప్పులు నడుస్తుంది.

రైలు ఆగే స్టేషన్లు (హాల్ట్‌లు):

ఈ ప్రత్యేక రైళ్లు ఇరువైపులా తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడులోని పలు ముఖ్యమైన స్టేషన్లలో ఆగుతాయి:

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్: నల్గొండ, మిర్యాలగూడ, నడికుడి, సత్తెనపల్లి, గుంటూరు, తెనాలి, బాపట్ల, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, నాయుడుపేట, సూళ్లూరుపేట.

తమిళనాడు: చెన్నై ఎగ్మోర్, తాంబరం, చెంగల్పట్టు, విల్లుపురం, వృద్ధాచలం, తిరుచిరాపల్లి, దిండిగల్, మధురై, విరుదునగర్, సాత్తూర్, కోవిల్‌పట్టి, తిరునెల్వేలి, వల్లియూర్.

కోచ్‌ల వివరాలు:

ఈ పండుగ ప్రత్యేక రైళ్లలో 2 స్లీపర్ క్లాస్ జనరల్ సెకండ్ క్లాస్‌కోచ్‌లను అందుబాటులో ఉంచారు.పండుగ వేళల్లో స్వగ్రామాలకు, పర్యాటక ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు ఈ ప్రత్యేక రైలు సర్వీసులను వినియోగించుకోవాలని రైల్వే శాఖ సూచించింది.

## రూ.100 పెట్రోల్ కొడితే హీరో స్ప్లెండర్ ఎంత దూరం వెళ్తుందో తెలుసా?




కంపెనీ అత్యధికంగా అమ్ముడయ్యే బైక్ అయిన హీరో స్ప్లెండర్, నాలుగు వేరియంట్లు, ఐదు రంగుల ఆప్షన్‌లలో లభిస్తుంది. అంతేకాకుండా కొనుగోలుతో పాటు ఐదేళ్ల వారంటీ కూడా లభిస్తుంది. ఎవరైనా ప్రతి రోజు తమ బైక్‌పై ఎక్కువగా ప్రయాణిస్తుంటే మంచి.. హీరో స్ప్లెండర్ భారతదేశంలోని అత్యంత ప్రజాదరణ పొందిన కమ్యూటర్ బైక్‌లలో ఒకటి. ఇది ముఖ్యంగా దాని అద్భుతమైన ఇంధన సామర్థ్యానికి ప్రసిద్ధి చెందింది. ఇది చాలా కాలంగా రోజువారీ ప్రయాణికులకు ఇష్టమైనదిగా ఉంది. దీని తేలికైన, సరళమైన డిజైన్, అలాగే తక్కువ ఇంధన వినియోగంతో ఎక్కువ దూరం ప్రయాణించగల సామర్థ్యం దీని ముఖ్య బలాలు. హీరో స్ప్లెండర్ లీటరుకు సుమారు 60 నుంచి 70 కిలోమీటర్ల మైలేజీని ఇస్తుంది. దీని ఆటోమోటివ్ రీసెర్చ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ARAI) ధృవీకరించిన మైలేజీ 73 ఎిఎజూశ్రీ. తత్ఫలితంగా, ఈ బైక్ రూ.100 విలువైన పెట్రోల్‌తో సుమారుగా 65 కిలోమీటర్ల దూరం ప్రయాణించగలదు. అయితే ఈ మైలేజీ అనేది బైక్ నడిపే విధానం, రోడ్డు, స్పీడ్‌ను బట్టి మారుతుందని గుర్తించుకోండి.

ARAI గణాంకాలు బైక్ టెస్టింగ్ సమయంలో బయపడతాయి. అయితే ట్రాఫిక్, రహదారి పరిస్థితులు, బైక్ పరిస్థితులు, రైడింగ్ శైలిని బట్టి రహదారి మైలేజీ మారవచ్చు. ARAI గణాంకాలు టెస్టింగ్ దశలో వెల్లడవుతాయి. అయితే ట్రాఫిక్, రహదారి పరిస్థితులు, బైక్ పరిస్థితులు, రైడింగ్ శైలిని బట్టి రహదారి మైలేజీ మారవచ్చు. హీరో స్ప్లెండర్ ప్లస్ ఒక లీటరు పెట్రోల్‌కు సుమారుగా 65 కిలోమీటర్ల మైలేజీని ఇస్తుందని అంచనా. అంటే, రోజువారీ వాడకంలో బైక్ వాస్తవ మైలేజీ, కంపెనీ లేదా పరీక్షల గణాంకాలకు భిన్నంగా ఉండవచ్చు. హీరో స్ప్లెండర్‌లో 9.8-లీటర్ల ఫ్యూయల్ ట్యాంక్ ఉంది. ఈ ట్యాంక్ సామర్థ్యం సుదీర్ఘ ప్రయాణాలలో తరచుగా ఇంధనం నింపవలసిన అవసరాన్ని తగ్గిస్తుంది. అయితే, వాస్తవ మైలేజ్, వినియోగ పరిస్థితులు ఒకే ట్యాంక్‌తో బైక్ ఎంత దూరం ప్రయాణించగలదో నిర్ణయిస్తాయి. కంపెనీ అత్యధికంగా అమ్ముడయ్యే బైక్ అయిన హీరో స్ప్లెండర్, నాలుగు వేరియంట్లు, ఐదు రంగుల ఆప్షన్‌లలో లభిస్తుంది. అంతేకాకుండా కొనుగోలుతో పాటు ఐదేళ్ల వారంటీ కూడా లభిస్తుంది. ఎవరైనా ప్రతి రోజు తమ బైక్‌పై ఎక్కువగా ప్రయాణిస్తుంటే మంచి మైలేజీ వారి పెట్రోల్ ఖర్చులను తక్కువగా ఉంచడంలో సహాయపడుతుంది. అందుకే ఇంధన ట్యాంక్ సామర్థ్యం, నిర్వహణ, రోజువారీ వినియోగానికి సౌకర్యం వంటి అంశాలను కూడా పరిగణలోకి తీసుకుంటారు. ఒక బైక్ వాస్తవ ప్రతి రైడర్‌కు ఒకేలా ఉండదు. ట్రాఫిక్‌లో తరచుగా బ్రేకులు వేయడం, అధిక వేగంతో డ్రైవింగ్ చేయడం, టైర్లలో గాలి తక్కువగా ఉండటం, లేదా మీ బైక్ సమయానికి సర్వీసింగ్ చేయించకపోవడం వంటివన్నీ మైలేజీపై ప్రభావం చూపుతాయి.

## సూర్యకాంతి లేకపోయినా సోలార్ బ్యాటరీ ఎన్ని గంటలు వస్తుంది?



సోలార్ బ్యాటరీ బ్యాకప్‌ను లెక్కించడానికి ఒక సులభమైన మార్గం ఏమిటంటే, బ్యాటరీ ఉపయోగపడే సామర్థ్యాన్ని మీ మొత్తం విద్యుత్ లోడ్‌తో భాగించడం. ఉదాహరణకు, మీరు ఉపయోగించడానికి 4 ఎిఔష్ట్ర విద్యుత్ కలిగి ఉండి, సగటు గృహ లోడ్.. సౌర ఫలకాలకు విద్యుత్తును ఉత్పత్తి చేయడానికి సూర్యరశ్మి అవసరం. ఒకవేళ సౌర వ్యవస్థకు బ్యాటరీని అమర్చినట్లయితే, పగటిపూట నిల్వ చేసిన విద్యుత్తును తర్వాత ఉపయోగించుకోవచ్చు. ఇప్పుడు అసలు ప్రశ్న ఏంటంటే.. ఒక రోజంతా సూర్యరశ్మి లేకపోయినా, సౌర ఫలకాలు విద్యుత్తును ఉత్పత్తి చేయకపోయినా, బ్యాటరీ ఎంతకాలం పనిచేస్తుంది? దీనికి కచ్చితమైన సమాధానం లేదు. బ్యాటరీ ఎంత పెద్దదిగా ఉంటే, విద్యుత్తు వినియోగం ఎంత తక్కువగా ఉంటే ఆ వ్యవస్థ అంత ఎక్కువ కాలం పనిచేస్తుంది. విద్యుత్తును ఉత్పత్తి చేయడానికి సోలార్ ప్యానెళ్లకు కాంతి అవసరం. పగటిపూట సూర్యరశ్మి లేకపోతే , ప్యానెళ్ల నుండి వచ్చే విద్యుత్ ఉత్పత్తి గణనీయంగా తగ్గిపోతుంది. అటువంటి పరిస్థితిలో సిస్టమ్‌లో బ్యాటరీ ఉంటే, ఇంటి విద్యుత్ అవసరాలను తీర్చవచ్చు. అయితే, బ్యాటరీ లేని ఆన్-గ్రిడ్ సోలార్ సిస్టమ్, రాత్రిపూట లేదా సూర్యరశ్మి లేని విద్యుత్ అంతరాయాల సమయంలో బ్యాకప్‌ను అందించదు. అందువల్ల మీ సోలార్ సిస్టమ్ ఎంతకాలం పనిచేస్తుందో నిర్ణయించే ముందు, మీ సిస్టమ్‌లో బ్యాటరీ ఉందో లేదో తనిఖీ చేయడం ముఖ్యం. బ్యాటరీ ఎంత పెద్దదిగా ఉంటే, బ్యాకప్ అంత మెరుగ్గా ఉంటుంది: మీ ఇంట్లో 5 ఎిఔష్ట్ర బ్యాటరీ అమర్చి ఉందని అనుకుందాం. మీరు నిరంతరంగా సుమారు 500 వాట్స్ (0.5 ఎిఔ) ఉపయోగిస్తుంటే, ఆ బ్యాటరీ సాధారణంగా సుమారు 10 గంటల పాటు పనిచేయగలదు. అయితే, బ్యాటరీ పూర్తి సామర్థ్యం పూర్తిగా వినియోగించదు. సిస్టమ్‌లో కొంత పవర్ నష్టపోతుంది. అందువల్ల, వాస్తవ బ్యాకప్ దీని కంటే తక్కువగా ఉండవచ్చు. అదేవిధంగా, విద్యుత్ వినియోగం కేవలం 250 వాట్స్ అయితే, అదే బ్యాటరీ ఎక్కువ కాలం పాటు విద్యుత్‌ను అందించగలదు. దీని అర్థం బ్యాటరీ సామర్థ్యం, లోడ్ రెండింటినీ పరిగణనలోకి తీసుకోవాలి. ఇంట్లో ఏయే ఉపకరణాలు పనిచేస్తున్నాయో తెలుసుకోవడం కూడా ముఖ్యం. సూర్యరశ్మి లేనప్పుడు, మీరు బ్యాటరీ పవర్‌పై ఆధారపడి ఉన్నప్పుడు, మీరు మీ టీవీ, ఫ్యాన్, రిఫ్రిజిరేటర్, లైట్లు, కూలర్, ఇతర ఉపకరణాలను ఎంత ఎక్కువగా ఉపయోగిస్తే, బ్యాటరీ అంత వేగంగా అయిపోతుంది. ఉదాహరణకు, కేవలం కొన్ని రాజుణ బల్బులు, ఫ్యాన్‌లను నడపడం వల్ల ఎక్కువ సేపు బ్యాకప్ వస్తుంది. అయితే ఏసీ, గీజర్ లేదా ఎక్కువ విద్యుత్ వినియోగించే ఇతర ఉపకరణాలను నడపడం వల్ల బ్యాటరీ వేగంగా అయిపోతుంది. అందువల్ల అటువంటి రోజులలో మీ విద్యుత్ వినియోగాన్ని తగినంత తక్కువగా ఉంచుకోవడం మీ బ్యాకప్‌ను పెంచుకోవడానికి సులభమైన మార్గం. సోలార్ బ్యాటరీ బ్యాకప్‌ను లెక్కించడానికి ఒక సులభమైన మార్గం ఏమిటంటే, బ్యాటరీ ఉపయోగపడే సామర్థ్యాన్ని మీ మొత్తం విద్యుత్ లోడ్‌తో భాగించడం. ఉదాహరణకు, మీరు ఉపయోగించడానికి 4 ఎిఔష్ట్ర విద్యుత్ కలిగి ఉండి, సగటు గృహ లోడ్ 500 వాట్స్ (0.5 ఎిఔ) అయితే, మీరు సుమారుగా 8 గంటల బ్యాకప్ పొందవచ్చు. ఇది కేవలం ఒక ఉదాహరణ మాత్రమే. వాస్తవ బ్యాకప్ అనేది బ్యాటరీ టెక్నాలజీ, ఇన్వర్టర్ సామర్థ్యం, ??బ్యాటరీ పరిస్థితి, ఉపయోగించే ఉపకరణాలపై ఆధారపడి ఉంటుంది. మీ సోలార్ సిస్టమ్‌కు తగినంత బ్యాటరీ సామర్థ్యం ఉంటే, సూర్యరశ్మి లేని రోజున కూడా అది ఇంటికి అవసరమైన విద్యుత్‌ను చాలా గంటల పాటు అందించగలదు. అయితే, బ్యాటరీ చిన్నదిగా ఉండి, మీ ఇంటి విద్యుత్ వినియోగం ఎక్కువగా ఉంటే, బ్యాకప్ త్వరగా అయిపోతుంది. అంతేకాకుండా, వరుసగా చాలా రోజుల పాటు తగినంత సూర్యరశ్మి లేకపోతే, బ్యాటరీ సరిగ్గా రీఛార్జ్ అవ్వడానికి ఇబ్బంది.

## కొత్త ఇల్లు నిర్మాణంలో పునాదికి ఎంత ఖర్చు అవుతుంది? సిమెంట్, ఇసుక, ఐరన్, ఇటుకలు, మేస్త్రీ ఖర్చు!



నిర్మాణ ఖర్చులు ప్రాంతాన్ని బట్టి, మెటీరియల్ ధరలలో మార్పులను బట్టి, మట్టి పరిస్థితిని బట్టి, ఇంజనీర్ సూచించే ఫౌండేషన్ డిజైన్‌ను బట్టి మారవచ్చు. ఇంటి నిర్మాణం ప్రారంభించే ముందు స్థానిక ధరలను, నిపుణుల సలహాలను తీసుకోవడం మంచిది.. ఒక కొత్త ఇంటి నిర్మాణంలో పునాది (బేస్మెంట్) వేయడం అత్యంత కీలకమైన, ప్రాథమిక దశ. ఇంటి పటిష్టతకు, దీర్ఘకాల మన్నికకు పునాది నిర్మాణం ఎంతో ప్రాముఖ్యత వహిస్తుంది. ఈ ప్రక్రియకు ఎంత సమయం పడుతుంది. ఎంత మంది వర్కర్లు అవసరమవుతారు? ముఖ్యంగా దీనికి అయ్యే ఖర్చు ఎంత అనే విషయాలను వివరంగా తెలుసుకోవడం ఇంటి యజమానులకు అవసరం. ఈ వివరాలు 133 గజాలు (సుమారు 1200 చదరపు అడుగులు) విస్తీర్ణంలో నిర్మించే ఇంటి బేస్మెంట్ నిర్మాణానికి అయ్యే అంచనా ఖర్చులను వివరిస్తుంది. సాధారణంగా ఒక బేస్మెంట్ నిర్మాణం పూర్తవడానికి సుమారు ఆరు రోజులు పడుతుంది. ఈ పనిని ఎనిమిది మంది సభ్యుల బృందం నిరంతరంగా పనిచేస్తూ పూర్తి చేయగలదు. ఇందులో రాడ్ బెండర్లు, మేస్త్రీలు, హెల్పర్లు ఉంటారు. మొదటి రోజు నుండి బేస్మెంట్ పని పూర్తయ్యే వరకు ఏ పని జరిగింది, ఏ మెటీరియల్ ఎంత వాడారు, ఎంత పని పూర్తయింది వంటి వివరాలను పర్యవేక్షించడం ఖర్చుల నిర్వహణకు కీలకం.

**బేస్మెంట్ నిర్మాణానికి అవసరమయ్యే మెటీరియల్స్, వాటి ఖర్చులు:**

1. ఇసుక: పునాది నిర్మాణంలో ఇసుక కీలక పాత్ర పోషిస్తుంది. 1200 చదరపు అడుగుల ఇంటి బేస్మెంట్ కోసం సుమారు 6 యూనిట్ల ఇసుక అవసరమవుతుంది. దీనికి అంచనా వ్యయం రూ.12,000.

2. సిమెంట్: కాంక్రీట్ మిశ్రమానికి సిమెంట్ ప్రధాన బైండింగ్ ఏజెంట్. బేస్మెంట్ నిర్మాణానికి దాదాపు 100 బస్తాల సిమెంట్ అవసరం కావచ్చు. ఒక బస్తా సిమెంట్ ధర సగటున రూ.300 అనుకుంటే, సిమెంట్ కోసం రూ.30,000 ఖర్చు అవుతుంది.

3. స్టీల్/ఐరన్: ఇంటి పునాదికి పటిష్టతను చేకూర్చడానికి స్టీల్ లేదా ఐరన్ బార్లు అత్యవసరం. సుమారు 1.5 టన్నుల స్టీల్ అవసరమవుతుంది, దీనికి అంచనా ఖర్చు రూ.90,000.

4. ఇటుకలు: పునాది గోడల నిర్మాణానికి ఇటుకలు ఉపయోగిస్తారు. బేస్మెంట్, చుట్టూ కాంపౌండ్ వాల్ కోసం సుమారు 8,000 ఇటుకలు అవసరం కావచ్చు. ఒక ఇటుక ధర రూ.7 అనుకుంటే, ఇటుకల కోసం రూ.56,000 వ్యయం అవుతుంది.

5. కంకర: కాంక్రీట్ మిశ్రమంలో కంకరను కూడా వాడతారు. బేస్మెంట్ కోసం సుమారు 3 యూనిట్ల కంకర అవసరమవుతుంది. దీనికి రూ.18,000 ఖర్చు కావచ్చు.

**మేస్త్రీలు, కూలీల ఖర్చులు:**

రాడ్ బెండర్లు, మేస్త్రీలు, కూలీలతో సహా మొత్తం కార్మికుల వేతనాలు బేస్మెంట్ నిర్మాణ ఖర్చులో గణనీయమైన భాగాన్ని ఆక్రమిస్తాయి. ఈ 1200 చదరపు అడుగుల ప్రాజెక్టుకు కార్మికుల ఖర్చులు సుమారు రూ.1,00,000 వరకు అంచనా వేస్తున్నారు బిల్డర్స్. ఈ ఖర్చులు ప్రాంతాన్ని బట్టి, కార్మికుల లభ్యతను బట్టి మారవచ్చు.

**మొత్తం అంచనా ఖర్చు:**

పైన పేర్కొన్న అన్ని ఖర్చులను కలిపితే, 1200 చదరపు అడుగుల ఇంటి బేస్మెంట్ నిర్మాణానికి మొత్తం అంచనా వ్యయం సుమారు రూ.3,06,000 అవుతుంది. దీనికి అదనంగా, కార్మికుల భోజనం, టిఫిన్లు వంటి చిన్నపాటి ఖర్చులు రూ.10,000 నుంచి రూ.20,000 వరకు అదనంగా పడవచ్చు. కనుక మొత్తం బేస్మెంట్ నిర్మాణ ఖర్చు సుమారు రూ.3,10,000 నుంచి రూ.3,20,000 వరకు ఉండవచ్చు. ఈ అంచనా ఖర్చులు సూచనప్రాయమైనవి మాత్రమే. నిర్మాణ ఖర్చులు ప్రాంతాన్ని బట్టి, మెటీరియల్ ధరలలో మార్పులను బట్టి, మట్టి పరిస్థితిని బట్టి, ఇంజనీర్ సూచించే ఫౌండేషన్ డిజైన్‌ను బట్టి మారవచ్చు. ఇంటి నిర్మాణం ప్రారంభించే ముందు స్థానిక ధరలను, నిపుణుల సలహాలను తీసుకోవడం మంచిది.

## 150 గజాల స్థలంలో ఇంటి నిర్మాణానికి ఎంత ఖర్చు అవుతుందో తెలుసా..? 3 రకాల బడ్జెట్లు మీ కోసం!



ఇల్లు కట్టడం ప్రారంభించే ముందే మీ బడ్జెట్ ఎంత, ఎటువంటి నాణ్యతతో ఇల్లు కావాలి అని స్పష్టంగా నిర్ణయించుకోవాలి. ప్రతి దశలోనూ ఖర్చులను అంచనా వేసి, ప్రణాళిక ప్రకారం ముందుకు సాగితే, చివరి నిమిషంలో ఆర్థిక ఇబ్బందులు, ఒత్తిడి లేకుండా కలల ఇంటిని నిర్మించుకోవచ్చు.. మీరు 150 గజాల స్థలంలో కలల ఇంటిని నిర్మించాలనుకుంటున్నారా? అయితే, నిర్మాణానికి ఎంత ఖర్చవుతుంది అనే ప్రశ్న మిమ్మల్ని వేధిస్తుంటుంది. 20 లక్షలు, 30 లక్షలు, 40 లక్షలు -- ఇలా రకరకాల అంచనాలు వినపడుతుంటాయి. ఈ గందరగోళాన్ని నివారించడానికి, 150 గజాల స్థలంలో ఇంటి నిర్మాణానికి అయ్యే నిజమైన ఖర్చును, అది మీ ఎంపికలను బట్టి ఎలా మారుతుందో తెలుసుకుందాం. అయితే సమాచారం డిల్డర్స్, మేస్త్రీలు అందించిన వివరాల ప్రకారం మాత్రమే. మీ ప్రాంతం బట్టి ధరల్లో తేడా ఉండవచ్చు. ఎందుకంటే ఏరియాను బట్టి ఇసుక, సిమెంట్, మేస్త్రీలు, కూలీల ఖర్చు హెచ్చుతగ్గులు ఉంటాయని గుర్తించుకోండి. అయితే ఈ వివరాలు అంచనా మాత్రమేనని గమనించండి.ముందుగా, 150 గజాల స్థలం అంటే ఎంత విస్తీర్ణం వస్తుందో చూద్దాం. ఒక గజం 9 చదరపు అడుగులకు సమానం కాబట్టి, 150 గజాలు అంటే 1350 చదరపు అడుగులు (150ఇ 9 = 1350). ఈ 1350 చదరపు అడుగుల నిర్మాణ ప్రాంతంలో మీరు ఎటువంటి నాణ్యతతో ఇల్లు నిర్మించుకుంటారు అనే దానిపై మొత్తం వ్యయం ఆధారపడి ఉంటుంది. నిర్మాణ నాణ్యత ఆధారంగా మేము మూడు ప్రధాన శ్రేణులను విభజించి, వాటి ఖర్చులను అంచనా వేద్దాం.

### 1. సాధారణ ఇల్లు (బడ్జెట్-ఫ్రెండ్లీ నిర్మాణం)

ఈ వర్గంలో లగ్జరీ కాకుండా, మరీ తక్కువ నాణ్యత కాకుండా, మధ్యస్థాయి మెటీరియల్స్‌తో ఇల్లు నిర్మిస్తారు. సాధారణ అవసరాలను తీర్చే, చూడటానికి చక్కగా ఉండే ఇంటికి ఇది సరైన ఎంపిక.

చదరపు అడుగుల వ్యయం: సుమారు రూ. 1650.

మొత్తం వ్యయం (1350 చ.అ.): రూ. 1650 ఇ 1350 చ.అ. = రూ. 22,27,500.

అంచనా శ్రేణి: రూ. 22 లక్షల నుండి రూ. 23 లక్షల వరకు.

ఈ బడ్జెట్‌లో, ప్రాథమిక మెటీరియల్స్‌తో, నిర్మాణ నాణ్యత విషయంలో రాజీ పడకుండా ఇల్లు సిద్ధం అవుతుంది.

### 2. స్టాండర్డ్ ఇల్లు (మధ్యస్థ నాణ్యత నిర్మాణం)

మధ్యతరగతి కుటుంబాలకు ఇది మంచి ఎంపిక. సాధారణ ఇంటి కంటే కొంచెం మెరుగైన నాణ్యతతో, చక్కని ఫినిషింగ్‌తో ఇల్లు కట్టించుకోవాలనుకునే వారికి ఇది అనుకూలం.

మెటీరియల్స్: మంచి టైల్స్, బ్రాండెడ్ ఎలక్ట్రికల్ వైర్లు, మెరుగైన బాత్రూమ్ ఫిట్టింగ్స్, మరీ లగ్జరీ కాకుండా, మధ్యస్థాయి నాణ్యత గల వస్తువులను ఉపయోగిస్తారు.

చదరపు అడుగుల వ్యయం: సుమారు రూ. 2000.

మొత్తం వ్యయం (1350 చ.అ.): రూ. 2000 ఇ 1350 చ.అ. = రూ. 27,00,000.

అంచనా శ్రేణి: రూ. 25 లక్షల నుండి రూ. 28 లక్షల వరకు.

ఈ బడ్జెట్‌లో, ఆధునిక సదుపాయాలతో, చూడటానికి మరింత ఆకర్షణీయంగా ఉండే ఇల్లు నిర్మించవచ్చు.

### 3. ప్రీమియం ఇల్లు (లగ్జరీ నిర్మాణం)

జీవితంలో ఒక్కసారే ఇల్లు కడతాం కాబట్టి, అత్యుత్తమ నాణ్యతతో, లగ్జరీ సదుపాయాలతో ఇల్లు కావాలనుకునే వారికి ఈ ఎంపిక సరిపోతుంది.

మెటీరియల్స్: గ్రానైట్ ఫ్లోరింగ్, హై-ఎండ్ ప్రీమియం టైల్స్, బ్రాండెడ్ డిజైనింగ్, అధునాతన బాత్రూమ్ ఫిట్టింగ్స్ వంటివి ఇందులో ఉంటాయి.

చదరపు అడుగుల వ్యయం: సుమారు రూ. 3000.

మొత్తం వ్యయం (1350 చ.అ.): రూ. 3000 ఇ 1350 చ.అ. = రూ. 40,50,000.

అంచనా శ్రేణి: రూ. 40 లక్షలకు పైగా.

ఈ బడ్జెట్‌లో, అత్యున్నత స్థాయి సౌకర్యాలు, డిజైనింగ్‌తో కూడిన విలాసవంతమైన ఇంటిని పొందవచ్చు.

**అదనపు ఖర్చులు**

పైన పేర్కొన్న అంచనాలు కేవలం నిర్మాణ వ్యయానికి సంబంధించినవి. ఇవి కాకుండా, కొన్ని అదనపు ఖర్చులు కూడా ఉంటాయి, వీటిని చాలా మంది విస్మరిస్తుంటారు:

ఆకస్మిక వ్యయాలు: నిర్మాణం జరిగేటప్పుడు డిజైన్‌లలో మార్పులు, మెటీరియల్స్‌ను అప్‌గ్రేడ్ చేయడం వంటివి సాధారణం. ఇవి మీ బడ్జెట్‌కు అదనంగా రూ. 3-4 లక్షలు చేర్చవచ్చు.

నిపుణుల రుసుములు: ఇంజనీర్, ఆర్కిటెక్ట్, వాస్తు పండితుల రుసుములు, లీగల్ ఖర్చులు వంటివి. వీటి కోసం అదనంగా రూ. 1-2 లక్షలు కేటాయించాల్సి ఉంటుంది.

ఈ ఖర్చులన్నీ హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో సాధారణంగా అమలులో ఉన్న రేట్లు. బిల్డర్లు సాధారణంగా ఈ అంచనాలతోనే పనులు చేసి ఇస్తారు.

ముఖ్యమైన సూచన ఏంటంటే, ఇల్లు కట్టడం ప్రారంభించే ముందే మీ బడ్జెట్ ఎంత, ఎటువంటి నాణ్యతతో ఇల్లు కావాలి అని స్పష్టంగా నిర్ణయించుకోవాలి. ప్రతి దశలోనూ ఖర్చులను అంచనా వేసి, ప్రణాళిక ప్రకారం ముందుకు సాగితే, చివరి నిమిషంలో ఆర్థిక ఇబ్బందులు, ఒత్తిడి లేకుండా కలల ఇంటిని నిర్మించుకోవచ్చు.

## మీ గ్రామంలో ఈ వ్యాపారాన్ని ప్రారంభిస్తే ప్రభుత్వం నుంచి రూ.10 లక్షల సాయం..!



ప్రభుత్వం చిన్న ఆహార శుద్ధి వ్యాపారాలకు ఆర్థిక సహాయం అందిస్తుంది. చిన్న ఆహార వ్యాపారాలను బలోపేతం చేయడం, వారికి ఉత్తమమైన యంత్రాలు, ప్యాకేజింగ్‌ను అందించడం, అలాగే స్థానిక స్థాయిలో ఉపాధి అవకాశాలను పెంచడం ఈ పథకం ముఖ్య ఉద్దేశ్యం.. మీరు గ్రామంలో వ్యాపారం ప్రారంభించాలని ఆలోచిస్తుంటే, పచ్చడి-పాపడ్ వ్యాపారం మీకు ఒక మంచి ఎంపిక కావచ్చు. దీనిని ఇంటి నుండే చిన్న స్థాయిలో సులభంగా ప్రారంభించవచ్చు. డిమాండ్ పెరిగితే మంచి ఆదాయాన్ని కూడా పొందవచ్చు. ప్రత్యేక విషయం ఏమిటంటే ప్రధానమంత్రి సూక్ష్మ ఆహార శుద్ధి పరిశ్రమ పథకం (ౕవీఖీవీజు) కింద ప్రభుత్వం చిన్న ఆహార శుద్ధి వ్యాపారాలకు ఆర్థిక సహాయం అందిస్తుంది. చిన్న ఆహార వ్యాపారాలను బలోపేతం చేయడం, వారికి ఉత్తమమైన యంత్రాలు, ప్యాకేజింగ్‌ను అందించడం, అలాగే స్థానిక స్థాయిలో ఉపాధి అవకాశాలను పెంచడం ఈ పథకం ముఖ్య ఉద్దేశ్యం. ఇలాంటి పరిస్థితుల్లో మీరు గ్రామంలో పచ్చడి-పాపడ్ వ్యాపారాన్ని ఎలా ప్రారంభించవచ్చో తెలుసుకోండి.

**రూ. 10 లక్షల వరకు సహాయం**

PMFME ((Pradhan Mantri Formalisation of Micro Food Processing Enterprises) పథకం కింద ఒక వ్యక్తి ఆహార వ్యాపారాన్ని ప్రారంభించడానికి 35 శాతం వరకు రుణ-అనుసంధాన మూలధన రాయితీని పొందుతారు. గరిష్ట పరిమితి రూ. 10 లక్షల వరకు ఉంటుంది. అయితే మొత్తం ఖర్చును ప్రభుత్వం భరించదు. ఆ వ్యక్తి తన సొంతంగా కూడా కొంత మొత్తాన్ని పెట్టుబడిగా పెట్టాల్సి ఉంటుంది. అయితే మీకు ప్రారంభించే వ్యాపారం, దానికి అయ్యే పెట్టుబడి పరిగణలోకి తీసుకుని మీకు రుణం మంజూరు చేస్తారు.

**పచ్చడి-పాపడ్ వ్యాపారాన్ని ఎలా ప్రారంభించాలి?**

ఈ వ్యాపారాన్ని ప్రారంభించడానికి అన్నిటికంటే ముందుగా మీరు ఏ ఉత్పత్తులను తయారు చేస్తారో నిర్ణయించుకోవాలి. గ్రామంలో సులభంగా లభించే ముడి పదార్థాల ఆధారంగా మీరు ఊరగాయలు, పాపడ్‌లు, చట్నీలు లేదా మసాలాల వంటి ఉత్పత్తులను ఎంచుకోవచ్చు. దీని తరువాత ముడి పదార్థాలు, యంత్రాలు, ప్యాకేజింగ్, విద్యుత్, మార్కెటింగ్‌లను దృష్టిలో ఉంచుకుని మీరు ఒక వ్యాపార ప్రణాళికను సిద్ధం చేసుకోవచ్చు. వ్యాపారానికి ఉత్పత్తి నాణ్యత చాలా ముఖ్యం. పరిశుభ్రత, సరైన తయారీ, సురక్షితమైన ప్యాకేజింగ్, ఉత్పత్తి గురించిన సరైన సమాచారం వినియోగదారుని నమ్మకాన్ని పెంచడంలో సహాయపడతాయి.

**మార్కెట్ కేవలం గ్రామాలకే పరిమితం కాదు:**

ఈ రోజుల్లో ఊరగాయలు, పాపడ్‌ల వంటి ఆహార ఉత్పత్తులను స్థానిక దుకాణాలతో పాటు నగరాల్లో కూడా అమ్మవచ్చు. మీరు గ్రామంలోని కిరాణా దుకాణాలు, స్థానిక మార్కెట్లు, సంతలతో ప్రారంభించవచ్చు. ఇది కాకుండా మీరు సోషల్ మీడియా, ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా కూడా చేరుకోవచ్చు. మీరు ఉత్పత్తికి మంచి ప్యాకేజింగ్, గుర్తింపును సృష్టిస్తే, వ్యాపారాన్ని క్రమంగా పెంచుకోవచ్చు.

**ఈ విధంగా దరఖాస్తు చేసుకోండి**

ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవడానికి మీరు ౕవీఖీవీజు అధికారిక పోర్టల్‌కు వెళ్లాలి. పోర్టల్‌లోని 'రిజిస్టర్' ఆప్షన్‌పై క్లిక్ చేసి, మీ పేరు, చిరునామా, మొబైల్ నంబర్ వంటి వివరాలను నింపి నమోదు చేసుకోండి. లాగిన్ అయిన తర్వాత పథకం దరఖాస్తు ఫారమ్‌ను తెరవండి. మీ వ్యాపారానికి సంబంధించిన సమాచారాన్ని అప్‌లోడ్ చేయండి. అడిగిన విధంగా అవసరమైన అన్ని పత్రాలను (ఆధార్, పాన్, బ్యాంకు వివరాలు) స్కాన్ చేసి అప్‌లోడ్ చేయండి. ఫారమ్‌ను సమర్పించండి. దరఖాస్తు సరైనదిగా తేలితే, మీ ప్రాజెక్ట్ కోసం బ్యాంకు రుణాన్ని ఆమోదిస్తుంది.

# సావాసం



"అమ్మగారూ.."రాజమ్మ పిలుపుతో, చేనంతా కలియ చూస్తున్న జానకమ్మ ఉలిక్కిపడింది. "ఈ మిరప చేను మాదే అమ్మగారూ! అరెకరం ఉంటది. మిర్చి ఏరడానికి కూలి మడుసులు దొరుకుతలేరు. అందరి తోటలు ఇప్పుడే కోతకొస్తయి కదా! గందుకని కైకిలికి కొద్దిమందే దొరికిండ్రు" అన్నది రాజమ్మ. మిరప తోటలో ఎర్రగా పండిన మిరపపండ్లు ఎంతో ఆనందాన్ని, ఆహ్లాదాన్ని కలిగిస్తున్నాయి. ఊరికి దగ్గరలోనే ఉన్నది ఆ చేను. "ఏం పని లేకుండ, ఇంటికాడ ఉత్తగనే కూసుంటే ఏం తోస్తది అమ్మగారూ! పాత ఇసయాలన్నీ యాదికొచ్చి గుబులైతుంటది. జర గిట్ల అటు, ఇటు తిరుగుతా ఉంటే మదికి కాస్త ఊరట వస్తది. గందుకనే నిన్ను ఇక్కడికి తోలుకొచ్చిన" అన్నది రాజమ్మ. లింగాపురం చిన్న గ్రామం. అతని కుమారుడైన వరదాచార్యులు కూడా తండ్రితోపాటు గుడికి వెళ్లేవాడు. అలా వెళుతూ అర్చకత్వం, పౌరోహిత్యం నేర్చుకున్నాడు. ఆ ఊరిలో శ్రీవైష్ణవుల కుటుంబాలు, బ్రాహ్మణుల కుటుంబాలు మరో నాలుగు ఉన్నాయి. కాలక్రమేణా దొర ఏర్పాటు చేసిన గుడిమాన్యం, ఊరి రాజకీయాలలో హరించుకుపోయింది. తిరువెంగళాచార్యుల అనంతరం వరదాచార్యులు అర్చకత్వానికి వచ్చేసరికి.. గుడికి వచ్చే ఆదాయం శూన్యమైపోయింది. గుడిలో రోజూ దీపం ముట్టించాలన్నా.. వరదాచార్యులే తన చేతి చమురు వదిలించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. వరదాచార్యులకు జానకమ్మతో వివాహం జరిగిన తర్వాత, కుటుంబ జరుగుబాటే కష్టమైపోయింది. గుడి అర్చకత్వంతోను, పౌరోహిత్యంతోను, ఒక కుటుంబం జీవించగలగడం చాలా కష్టమని అనుభవపూర్వకంగా తెలుసుకున్నారు. ఈలోగా కొడుకు వెంకటాచార్యులు, కూతురు గోదాదేవి జన్మించారు. "ఏమండీ! ఈ అర్చకత్వంతో మనం బతకడం, పిల్లలను చదివించుకోవడం కష్టం అవుతూ ఉంది కదండీ. మన ఊర్లో ఉన్న మన బంధువులు, బ్రాహ్మణ కుటుంబాలు కూడా పట్నానికి వలస పోతున్నారు కదండీ. మనం కూడా పట్నానికి వెళ్లి బతుకుదెరువు వెతుకుందామండీ" అంటూ బతిమిలాడింది జానకమ్మ. "ఈ వరదరాజ స్వామి గుడి, అర్చకత్వం మా తండ్రిగారి కోరిక మేరకు మన కుటుంబానికి లభించిన అదృష్టం. ఇదంతా వదిలేసి, ఇప్పుడు అర్ధంతరంగా వెళ్లిపోతే ఆయన ఆత్మ శాంతిస్తుందంటావా జానకీ " అన్నాడు వరదాచార్యులు. "ఆత్మల శాంతికోసం ఆలోచిస్తే, మన ఆత్మారాముడు ఎలా శాంతిస్తాడండీ? పిల్లలకు రెండు పూటలా కడుపునిండా తిండి పెట్టుకోవాలి కదా? పట్నంలో ఏదో ఒక పని చేసుకొని బతకవచ్చు. ఈ అరుపులకు, అలికిడికి రాజమ్మ బయటికి వచ్చింది. "ఏమైందిరా మల్లిగా! అయ్యగారికి ఏమైంది?" అడిగింది రాజమ్మ. "ఏమోనత్తా! గంట కొట్టుకుంటా కొట్టుకుంటా గట్లనే పక్కకు ఒరిగిపోయిండు. ఎంత పిలిచినా పలుకుతలేడు" అన్నాడు మల్లిగాడు. "అమ్మగారూ పద.. పొయ్యి చూద్దాం" అంటూ జానకమ్మను తీసుకొని వెళ్లింది రాజమ్మ. గుడిలో అచేతనంగా పడి ఉన్నాడు వరదాచార్యులు. రాజమ్మ మల్లిగాణ్ని పంపించి, ఆ ఊర్లో ఉన్న ఆర్ఎంపీ డాక్టరును పిలిపించింది.

డాక్టర్ వచ్చి పరీక్షించాడు.

"ఇది పక్షవాతం స్ట్రోక్ లాగా ఉన్నదమ్మా ! పక్కూరు గవర్నమెంట్ ఆసుపత్రికి తీసుకుపోండి" అని చెప్పి వెళ్లిపోయాడు. రాజమ్మ తన భర్తను పిలిపించి, బండి కట్టించి.. అయ్యగారిని పక్కూరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లింది. జానకమ్మ అంటే రాజమ్మకు చాలా ఇష్టం. ఇద్దరూ దాదాపు ఒకే ఈడువారు. దాదాపు ఒకే సంవత్సరం పెళ్లయి అత్తగారింటికి వచ్చారు. ఆ ఇద్దరి మధ్య స్నేహం బాగా అల్లుకుపోయింది. జానకమ్మ శ్రీవైష్ణవుల ఇంటిపిల్ల కాబట్టి.. రాజమ్మ ఆమెను ఎప్పుడూ గౌరవంగా 'అమ్మగారూ' అని పిలిస్తే.. జానకమ్మ ఆప్యాయంగా 'రాజమ్మా!' అని పిలిచేది. రాజమ్మ సహకారంతో వరదాచార్యులకు చికిత్స చేయించింది జానకమ్మ. అతనికి పక్షవాతం అని డాక్టర్లు చెప్పారు. మంచంలో ఉలుకుపలుకు లేకుండా పడి ఉన్న చెట్టంత మనిషిని చూస్తుంటే గుండెలు ఆర్చుకుపోతున్నాయి జానకమ్మకు. ఇంట్లో తిరుగుతున్న ఇద్దరు చిన్నపిల్లలను చూస్తూ ఏం చేయాలో, జీవితాన్ని ఎలా గడపాలో తెలియక దుఃఖ సముద్రంలో మునిగిపోయింది. పూజారి అక్షతలు చల్లి ఆశీర్వచనాలు పలికేవాడు. ఆ సందర్భంలో ఆ భక్తులలో కనిపించే గౌరవ మర్యాదలు చూస్తున్న వెంకటాచారికి, తన తండ్రి ఎంతో గొప్పవాడని, సాక్షాత్తూ భగవంతుడే అన్న తలంపు కలిగేది. తాము ఎంతో గొప్పవాళ్లం కాబట్టే, అలా గౌరవిస్తున్నారని భావన కలిగేది. కానీ, పక్షవాతం వచ్చి మంచాన పడిన తండ్రిని చూస్తూ ఉంటే.. అమ్మ కూలికి వెళ్లి తెచ్చిన జొన్న గటకతో కడుపులు నింపి, ఆకలి తీర్చుకుంటూ ఉంటే.. జీవితంలో మరోకోణం కూడా ఉంటుందని వెంకటాచార్యులకు అర్థమైంది. ఈ గింజలు గట్క వొండు. అయ్యగారికి, ఈ పిల్లలకు ఇంత తినిపించు. బాధపడతా కూసుంటే ఆకలి తీరదు కదా అమ్మా" అంటూ ఓదార్చి వెళ్లిపోయింది రాజమ్మ.

అప్పటికి రెండు రోజులైంది ఆ ఇంట్లో పొయ్యి రాజేసి. జానకమ్మకు ఆ గింజలే అమృతం లాగా అనిపించింది. జొన్న గటక తినడం పిల్లలకు ఎంతో కష్టమైంది. కొడుకు వెంకటాచార్యులు జొన్న గటక చూసి.. "అమ్మా! ఇది మనం తినే అన్నంలాగా లేదు కదమ్మా" అంటూ మొహం విరిచాడు. "నాన్నగారికి ఆరోగ్యం తొందరగా నయం కావాలంటే.. ఈ ఆహారమే ఇవ్వాలని డాక్టరు చెప్పాడు బాబూ. మరి నాన్నగారికి త్వరగా నయం కావాలి కదా నాన్నా" అంటూ నచ్చచెప్పింది జానకమ్మ. కష్టాల ఊబిలో ఉన్న జానకమ్మకు ఎలాగైనా సహాయం చేయాలని అనుకున్నది రాజమ్మ. కానీ ఏం చేయాలో అర్థం కాలేదు. అదే విషయం తన భర్తతో మాట్లాడింది. అతడి సలహా నచ్చింది ఆమెకు.

మర్నాడు రాజమ్మ తాను చేనుకు వెళ్లేటప్పుడు..

"జానకమ్మ గారూ! నాతోపాటు చేనుకు పోదాం రా. ఊరికెనే ఇంట్ల కూసుంటే గుబులుగ ఉంటది" అంటూ తనవెంట చేనుకు తీసుకెళ్లింది. అక్కడ ఒక గంట తర్వాత జానకమ్మకు విసుగు అనిపించింది. రాజమ్మ ఒక గంప తెచ్చి జానకమ్మకు ఇచ్చింది. "నాకు కాస్త సాయం చెయ్యండి అమ్మగారూ! ఈ పండు మిరపకాయలు తెంపి బుట్టలో వెయ్యి. ఏదో పని చేస్తా ఉంటే.. మనసు తెరిపిన పడుతది కదా!" అని ప్రోత్సహించింది. చేనులో కూలోళ్లను చూస్తూ కూర్చుంటే, నిజంగానే విసుగు చెందిన జానకమ్మకు.. కాస్త ఏదైనా పని చేస్తుంటే బావుండు అనిపించింది. తనుకూడా వాళ్లతో పాటు కూలి పనికి వెళుతున్నానని. కానీ, ఆ పని కూడా చేయకపోతే, ఆ కాసిన్ని తిండి గింజలు కూడా దొరకవనే సత్యం కూడా అవగతమైంది ఆమెకు.

ఆ విధంగా జానకమ్మను తన పరిధిలోకి తీసుకొచ్చుకున్నది రాజమ్మ.

"మీలాంటి పెద్దోల్లకు సాయపడితే మాకు పోయిన జన్మల పాపాలు పోతాయట తల్లీ" అంటూ జానకమ్మను తనవెంట కూలికి తీసుకొని పోయేది రాజమ్మ. కాలచక్రం తిరిగి పోయింది. వెంకటాచార్యులు చదువు పూర్తయ్యాక.. ప్రభుత్వ ఉద్యోగం దొరికింది. హాస్పిటల్లో రాజమ్మను చూడ్డానికి వెళ్లిన జానకమ్మ.. తన కిడ్నీని రాజమ్మకు ఇస్తానని చెప్పింది. డాక్టర్లు పరీక్ష చేసి.. ఆమె కిడ్నీ సరిపోతుందని చెప్పారు. కానీ, జానకమ్మకు ఇంట్లోంచి వ్యతిరేకత ప్రారంభమైంది.

వరదాచార్యులు, అతని వియ్యంకుడు పరమేశం దీనిని వ్యతిరేకించారు.

"తక్కువ కులం వాళ్లతో సహవాసం చేయడమే దోషం. నిత్యాగ్ని హెూత్రంలాంటి మన శ్రీ వైష్ణవ కుటుంబాలకు, ఆ తక్కువ కులం వాళ్లతో సావాసం ఏమిటి? ఇంతకాలం అడిగేవాళ్లు లేరనేగా! ఇప్పుడు ఈ ఇంటికి పిల్లనిచ్చిన వ్యక్తిగా నేనందుకు ఒప్పుకోను. అసలు ఆ తక్కువ కులం వాళ్లతో స్నేహమే నాకు ఇష్టం లేదు. మనవి సంశ్రయణాలు చేసిన సంప్రదాయ కుటుంబాలు. నిత్యం పూజలు, పునస్కారాలు చేసే శ్రీ వైష్ణవులం. ఈ కుల భ్రష్టతకు నేను ఒప్పుకోను. మనవాళ్లు కిడ్నీలు కూడా అలాంటి వారికి ఇవ్వకూడదు" అంటూ ఒంటికాలు మీద లేచాడు పరమేశం. తన బిడ్డను వెంకటాచార్యులకు ఇచ్చి పెళ్లి చేశాడు కాబట్టి.. ఆ విధంగా తన ఆధిక్యతను నిలుపుకోవాలని అతని ప్రయత్నం. నివ్వెరపోయిన జానకమ్మ.. వెంకటాచార్యుల వైపు చూసింది. ఆమె కళ్లలో నీళ్లు లేవు. గత కాలంలో తాము పడిన కష్టం, రాజమ్మతో ఆమె స్నేహం, రాజమ్మ చేసిన సహాయ సహకారాలు అన్నీ కనిపించాయి వెంకటాచార్యులకు. నెమ్మదిగా లేచి వచ్చి, తల్లి భుజం మీద చేయి వేశాడు. తల్లిని దగ్గరికి పొదువుకున్నాడు. ఆమె నుదుట ముద్దు పెట్టుకున్నాడు.

"మామయ్యా! మీ ఆరాటంలో అర్థం ఉన్నది. కానీ మానవత్వం లేదు. మా నాన్నగారికి జబ్బు చేసి, మంచాన పడి ఉన్న రోజున..ఈ విషయంలో మా అమ్మ ఏ నిర్ణయం తీసుకుంటే, దానికి అందరం బద్ధులమై ఉండాలి. ఇష్టం లేనివాళ్లు ఇప్పుడే వెళ్లిపోవచ్చు" అన్నాడు వెంకటాచారి ప్రశాంతంగా.

తూటాల్లాగా వెలువడిన ఆ మాటలలో ఒక నిర్దిష్టమైన నిర్ణయం కనిపించింది. పరిమళ లోపలికి వెళ్లి బ్యాగు తెచ్చి తండ్రికి ఇచ్చి.. గుమ్మం దాకా సాగనంపి వచ్చింది. చెట్టంత కొడుకు నీకు అండగ ఉన్నడు. ఏడవకుండ్రి. కండ్లు తుడ్సుకోండి!" అన్నది రాజమ్మ. "నీ సావాసమే నాకు కొండంత అండ రాజమ్మా!" అంటూ చీర కొంగుతో కళ్లు తుడుచుకున్నది జానకమ్మ.

నెల్లుట్ల రుక్మిణి

కష్టాల్లో ఉన్నవారికి ఎలాగైనా సాయం చేయాలనే తపన.. మానవ జీవితానికి విలువను తీసుకొస్తుంది. అలాంటి తపనతో ఉన్న ఓ నిరుపేద స్నేహితురాలికి, ఆమె ఆప్యాయతకు, స్నేహబంధానికి, సామాజిక అంతరాలు అడ్డురావని చెప్పే కథ.. 'సావాసం'. రచయిత్రి నెల్లుట్ల రుక్మిణి. మనుషులను, జీవితాలను, ప్రకృతిని పరిశీలించడం.. చిన్నప్పటినుంచే అలవాటు చేసుకున్నారు. 50 ఏళ్ల కింద.. ఇల్లెందు క్రాంతి స్కూలు ప్రిన్సిపాల్‌గా పని చేసినప్పుడు.. పేద విద్యార్థులకు ఉచితంగా విద్యాబోధన చేసేవారు. ఆ పిల్లల తల్లిదండ్రులతో కలిగిన పరిచయం.. వీరిలో కథలు రాయాలనే తలంపునకు కారణమైంది. వారు చెప్పిన జీవిత వెతలనే, కథలుగా మలిచేందుకు ప్రయత్నించారు. వీరు రాసిన పలు కథలు.. కొత్తగూడెం రేడియో కేంద్రంలో మూడేళ్లపాటు ప్రసారమయ్యాయి. అనేక కథలు వివిధ పత్రికలలో ప్రచురితమయ్యాయి. 'వెన్నెల పూలు' బాలగేయ సంపుటి, 'బతుకు ఎతలు' కథల సంపుటిని ముద్రించారు. అనేక బహుమతులు, అవార్డులు, సన్మానాలు అందుకున్నారు. నిర్మాతగా.. శ్రీ వెంకటేశ్వర మహత్యం, ఈ రాత్రి గడిస్తే చాలు చిత్రాలను నిర్మించారు.

# ఈ ఐదు నగరాలు ప్రపంచంలోనే సంపన్నమైనవి.. అన్ని సౌకర్యాలకు నెలవు..











ప్రపంచవ్యాప్తంగా అనేక నగరాలు ఉన్నాయి. వీటిలో కొన్ని పర్యాటక రంగంలో బెస్ట్, కొన్ని టెక్నాలజీలో బెస్ట్. అయితే చాల సిటీస్ మంచి జీవన వైవిధ్యం కలిగి ఉన్నాయి. అలాగే ప్రపంచంలో సంపన్న నగరాలు కూడా ఉన్నాయి. అయితే ప్రపంచవ్యాప్తంగా అనేక మందికి విద్య, ఉద్యోగంతో పాటు అన్ని అనువైన సౌకర్యాల అందించే నగరాలు కొన్ని మాత్రమే ఉన్నాయి. వాటిలో టాప్ 5 నగరాలూ ఏంటి.? ఈ స్టోరీలో తెలుసుకుందామా..

**న్యూయార్క్ నగరం,** యూనిట్ స్టేట్స్ అఫ్ అమెరికాలోని న్యూయార్క్ ఇప్పటికీ అగ్రస్థానంలో ఉంది. ఇది చాలా మంది బిలియనీర్లకు నిలయం. బలమైన ఫైనాన్స్, రియల్ ఎస్టేట్, టెక్ మార్కెట్‌ను కలిగి ఉంది. ప్రపంచ దేశాల నుంచి చాలామంది ప్రజలు ఇక్కడికి జాబ్స్ చేయడానికి వస్తారు.

**టోక్యో, జపాన్:** టోక్యో ఆసియాలో బలమైన నగరంగా మిగిలిపోయింది, అనేక ధనిక కుటుంబాలు, కంపెనీలు ఇక్కడ ఉన్నాయి. ఇక్కడ పాత సంస్కృతి, కొత్త వ్యాపారం మిశ్రమంగా ఉన్నాయి. జపాన్ ఎప్పుడు టెక్నాలజీలో ప్రపంచదేశాల అన్నింటికంటే ముందే ఉంటుంది.

**శాన్ ఫ్రాన్సిస్కో బే ఏరియా,** సిలికాన్ వ్యాలీతో సహా బే ఏరియా ఇప్పటికీ గూగుల్, ఆపిల్, ఫేస్‌బుక్ వంటి టెక్ దిగ్గజాలకు కేంద్రంగా ఉంది. ఇక్కడ చాలా మంది టెక్, స్టార్టప్‌లలో పనిచేస్తున్నారు. ఈ ప్రాంతం లక్షాధికారులతో నిండి ఉంది.

**లండన్,** లండన్ ఒక ప్రపంచ ఆర్థిక కేంద్రం. అనేక మంది సంపన్నులకు నిలయం. దీనికి బ్యాంకింగ్, ఫ్యాషన్, రియల్ ఎస్టేట్‌తో బలమైన సంబంధాలు ఉన్నాయి. ఈ నగరం విద్యారంగానికి ప్రసిద్ధ చెందింది. భారత్ సహా అనేక దేశాల విద్యార్థులు ఈ సిటీకి చదువుకోవడానికి వెళ్తారు.

**సింగపూర్:** సింగపూర్ ఆసియాలో ఒక పెద్ద ధన కేంద్రంగా మారింది. దాని తక్కువ పన్నులు, శుభ్రమైన వ్యవస్థ, బలమైన బ్యాంకింగ్ దీనిని ధనవంతులు, వ్యాపారాలకు అనువైనదిగా చేస్తాయి. తక్కువ పన్ను కారణం అనేక దేశాల ప్రజలు ఇక్కడకి పని కోసం వెళ్తుంటారు.

# మజ్జిగలో చిటికెడు ఇంగువ కలిపి తాగితే ఏం జరుగుతుందో తెలుసా..?













మజ్జిగతో కలిగే లాభాలేంటో దాదాపు ప్రతి ఒక్కరికీ తెలిసిందే, అయితే, మజ్జిగని నేరుగా తాగే బదులు ఓ పదార్థం కలిపి తాగితే బోలెడన్నీ లాభాలు ఉన్నాయని ఆయుర్వేద ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. ఇంగువ శరీరంలో ఎసిడిటీని తగ్గిస్తుంది. ఇంగువ ఇమ్యూనిటీని బలపరుస్తుంది. రోజూ ఉదయం ఖాళీ కడుపుతో మజ్జిగ తాగితే ఇంగువ తాగితే చాలా మంచిది. ఇంగువలో రోగ నిరోధకత, యాంటీ ఆక్సిడెంట్లు చాలా ఎక్కువ. ఇంగువతో బీపి తగ్గుతుంది. రక్త ప్రసరణ మెరుగ్గా మారుతుంది. రక్తం గడ్డకట్టడం లాంటి సమస్యలు ఉండవు. దీని వల్ల స్ట్రోక్, గుండె సమస్యలు, ప్రమాదకర సమస్యలు రావు. ఇంకా మరెన్నో లాభాలు ఉన్నాయని అవన్నీ తెలియాలంటే.. పూర్తి వివరాల్లోకి వెళ్లాల్సిందే...

మజ్జిగలో ఇంగువ కలుపుకుని తాగితే జీర్ణక్రియకు అద్భుతంగా ఉపయోగపడుతుంది. మజ్జిగలో కొద్దిగా ఇంగువ కలుపుకుని తాగితే గ్యాస్, ఉబ్బరం, ఎసిడిటీ సమస్యలు తగ్గుతాయి. పరగడుపున మజ్జిగ తాగితే చాలా మంచిది. జీర్ణ వ్యవస్థను మెరుగుపరుస్తుంది. ఇంగువ కలిపితే మరింత ఉపయోగం. ఇంగువ కలిపి తాగితే చాలా ప్రయోజనకరంగా పనిచేస్తుందని నిపుణులు చెబుతున్నారు.

గ్లాసు మజ్జిగలో 50-80 కేలరీలు ఉంటాయి. నెమ్మదిగా కరగడం వల్ల కడుపు నిండుగా ఉన్నట్టుంటుంది. మజ్జిగలో ప్రో బయోటిక్స్ పెద్దమొత్తంలో ఉంటాయి. జీర్ణ సంబంధిత సమస్యలను దూరం చేస్తాయి. బరువు తగ్గించే ఉపయోగపడుతుంది.

గ్లాసు మజ్జిగలో 50-80 కేలరీలు ఉంటాయి. నెమ్మదిగా కరగడం వల్ల కడుపు నిండుగా ఉన్నట్టుంటుంది. మజ్జిగలో ప్రో బయోటిక్స్ పెద్దమొత్తంలో ఉంటాయి. జీర్ణ సంబంధిత సమస్యలను దూరం చేస్తాయి. బరువు తగ్గించేందుకు ఉపయోగపడుతుంది.

మజ్జిగలో జీర్ణవ్యవస్థ మెరుగుపర్చే ప్రో బయోటిక్స్ పుష్కలంగా ఉంటాయి. ఇంగువ జీర్ణశక్తికి సంబంధించిన సమస్యలకు మందుగా పని చేస్తుంది. భోజనం చేసిన తరువాత చిటికెడు ఇంగువ, చిటికెడు ఉప్పును మజ్జిగలో కలిపి తీసుకుంటే పొట్టలో గ్యాస్ సమస్య గ్గుతుంది. దీనివల్ల ఆహారం చక్కగా జీర్ణమవుతుంది.

మజ్జిగలోని లాక్టోస్ కొంతమందికి అలర్జీలు, జీర్ణ సమస్యలకి కారణమవుతుంది. దీని వల్ల కొంతమందికి కడుపునొప్పి, విరోచనాలు, గ్యాస్ వంటి సమస్యలు వస్తాయి. కడుపు నొప్పి, విరోచనాలను తగ్గించడానికి కొద్దిగా ఇంగువ కలిపి తీసుకుంటే మంచిది. మెరుగైన జీర్ణక్రియతో పాటు ఆరోగ్యం బాగుంటుంది.

మ్మిరి కూడా తగ్గుతుందని నిపుణులు చెబుతున్నారు. ఆరోగ్య సమస్యలుంటే దీర్ఘకాలిక వ్యాధుల మందులు తీస్నుకునేవాళ్లు మజ్జిగ ఇంగువ తాగకూడదు.

ఇంగువ కలిపిన మజ్జిగ తీసుకోవటం వల్ల జీర్ణక్రియ మెరుగ్గా మారుతుంది. కడుపు నిండుగా ఉంటుంది. దీంతో అనారోగ్యకర ఆహారం ఎక్కువగా తినకుండా ఉంటారు. ఈ కారణంగానే బరువు తగ్గుతారు. ఈ రెండింటిని కలిపి తీసుకుంటే మహిళల్లో పీరియడ్స్ టైమ్‌లో వచ్చే నొప్పి, తిమ్మిరి కూడా తగ్గుతుందని నిపుణులు చెబుతున్నారు. ఆరోగ్య సమస్యలుంటే దీర్ఘకాలిక వ్యాధుల మందులు తీస్నుకునేవాళ్లు మజ్జిగ ఇంగువ తాగకూడదు.

# మీ ఇంట్లో దోమలు ఎక్కువగా ఉన్నాయా..? ఈ నాచురల్ టిప్స్‌ను పాటించండి చాలు..!



వర్షాకాలం వచ్చేసింది. సీజనల్ వ్యాధులు ఇప్పటికే చాలా మందికి వస్తున్నాయి. ఈ సీజన్ లో దోమలు కూడా దాడి చేసేందుకు సిద్ధమవుతున్నాయి. ఇలాంటి వాతావరణం ఉంటే దోమలు వృద్ధి చెందడం చాలా సులభతరం అవుతుంది. దీంతో దోమలు పుట్టలు పుట్టలుగా తయారై మన ఇండ్లలోకి వచ్చి మనపై దాడి చేస్తాయి. రాత్రి, పగలు తేడా లేకుండా మన రక్తాన్ని పీల్చి పిప్పి చేస్తుంటాయి. దీంతో మనకు అనేక విష జ్వరాలు, ఇన్‌ఫెక్షన్లు వస్తుంటాయి. అయితే కొన్ని రకాల సహజసిద్ధమైన చిట్కాలను పాటిస్తే దోమల బెడద ఉండదు. దోమలను తరిమి కొట్టవచ్చు. అందుకు ఏం చేయాలో ఇప్పుడు తెలుసుకుందాం. దోమలను తరమాలంటే ముందుగా దోమలు లేకుండా చూడాలి. ఇంటి చుట్టు పక్కల లేదా ఇంట్లో నీరు నిల్వ ఉండకుండా చేయాలి. దోమలకు ఇవే ఆవాసాలు కనుక నీరు ఎక్కడా నిల్వ ఉండకుండా చేయాలి.

### ఆయిల్స్..

చెత్తను కూడా శుభ్రం చేయాలి. ఎప్పటికప్పుడు పారిశుధ్య కార్మికులకు చెత్తను అందించాలి. ఇక దోమలను తరిమేందుకు యూకలిప్టస్ ఆయిల్ అద్భుతంగా పనిచేస్తుంది. ఒక స్ప్రే బాటిల్‌లో కొన్ని నీళ్లను తీసుకుని అందులో కొన్ని చుక్కల యూకలిప్టస్ ఆయిల్ వేయాలి. తరువాత బాగా కలపాలి. దీన్ని దోమలు ఉన్న చోట స్ప్రే చేయాలి. దీంతో దోమలు పారిపోతాయి. సిట్రొనెల్లా ఆయిల్ కూడా ఇలాగే అద్భుతంగా పనిచేస్తుంది. దీన్ని కూడా నీటిలో కలిపి ఉపయోగించాలి. దోమలను తరిమి కొట్టడంలో వేప నూనె కూడా అద్భుతంగానే పనిచేస్తుంది. మార్కెట్‌లో మనకు పలు రకాల ఎసెన్షియల్ ఆయిల్స్ లభిస్తాయి. ఇవన్నీ కూడా దోమలను తరిమికొట్టగలవు. లావెండర్ ఆయిల్, పెప్పర్ మింట్ ఆయిల్, టీ ట్రీ ఆయిల్, క్లోవ్ ఆయిల్, సినామన్ ఆయిల్, సోయాబీన్ ఆయిల్.. ఇలా పలు రకాల ఆయిల్స్ లభిస్తాయి. వీటిలో ఏ ఆయిల్‌ను వాడినా కూడా ఎంతగానో ఉపయోగం ఉంటుంది.

### మొక్కలు..

దోమలను తరిమికొట్టాలంటే మీ ఇంట్లో కొన్ని రకాల ఇండోర్ మొక్కలను పెంచుకోవాలి. సిట్రొనెల్లా గ్రాస్ అని పిలవబడే ఓ రకమైన గడ్డిని ఇంట్లో పెంచాలి. ఇది మస్కిటో రీపెల్లెంట్ గుణాలను కలిగి ఉంటుంది. దీని వాసన దోమలకు నచ్చదు. దోమలను తరిమి కొడుతుంది. ఈ మొక్క నిమ్మ వాసన వస్తుంది. అందుకనే దోమలు పారిపోతాయి. లావెండర్ అనే మొక్కను ఇంట్లో పెంచుతున్నా కూడా దోమల నుంచి రక్షణ లభిస్తుంది. ఈ మొక్క నుంచి వచ్చే వాసన కూడా దోమలకు పడదు. దోమలు దూరంగా పారిపోతాయి. తులసి మొక్క ఉన్న ఇంట్లోకి దోమలు రావని చెబుతారు. కనుక తులసి మొక్కను కూడా పెంచుకోవాలి. బంతి పూల మొక్కలను ఇంట్లో లేదా ఇంటి ఆవరణలో పెంచితే దోమల బెడద నుంచి రక్షణ లభిస్తుంది. బంతిపూలు వెదజల్లే వాసన దోమలకు నచ్చదు. దోమలు దూరంగా పారిపోతాయి.

### ఈ చిట్కాలు కూడా..

పుదీనా మొక్కలను ఇంట్లో పెంచుతున్నా కూడా ఉపయోగం ఉంటుంది. పుదీనా ఆకుల నుంచి వచ్చే వాసన దోమలకు నచ్చదు. అవి దూరంగా పారిపోతాయి. లెమన్ బామ్ అనే మొక్కను పెంచుతున్నా కూడా ఎంతగానో ఉపయోగం ఉంటుంది. దీని నుంచి వచ్చే ఘాటైన నిమ్మ వాసన దోమలకు నచ్చదు. ఇది దోమలను పారిపోయేలా చేస్తుంది. అలాగే రోజ్‌మేరీ మొక్కలను కూడా ఇంట్లో పెంచుకోవచ్చు. ఇవి కూడా దోమల నుంచి రక్షణను అందిస్తాయి. కాట్నిప్, యూకలిప్టస్, వెల్లుల్లి మొక్కలను పెంచుతున్నా కూడా ఉపయోగం ఉంటుంది. ఇవన్నీ దోమలు రాకుండా చేస్తాయి. అలాగే ఒక పాత్రలో కొద్దిగా నీటిని తీసుకుని అందులో కొన్ని కర్పూరం బిళ్లలను వేసి గదిలో పెట్టాలి. దాని నుంచి వచ్చే వాసనకు కూడా దోమలు పారిపోతాయి. అలాగే ఒక నిమ్మకాయను అడ్డంగా కోసి అందులో లవంగాలను గుచ్చి గదిలో కిటికీలు లేదా దోమలు ఉండే ప్రాంతంలో పెట్టాలి. ఈ వాసనకు కూడా దోమలు పారిపోతాయి. ఇలా దోమలను తరిమి కొట్టవచ్చు.